


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 225 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | సోమవారం 20 ఏప్రిల్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :225 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | MON 20 APRIL 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## క్రమంగా కోలుకుంటున్నాను.. మీ అందరి ఆదరణకు కృతజ్ఞతలు

- హైదరాబాద్‌లో శనివారం నాడు సర్జరీ చేయించుకున్న పవన్ కల్యాణ్
- తన ఆరోగ్యం నిలకడగా ఉందని, క్రమంగా కోలుకుంటున్నానని వెల్లడి
- సందేశాలు పంపిన రాజకీయ, సినీ ప్రముఖులకు పేరుపేరునా కృతజ్ఞతలు
- అన్నయ్య చిరంజీవి, నాగబాబు పోస్టులకు భావోద్వేగంగా స్పందించిన పవన్
- మాజీ సీఎం జగన్ విషెస్‌కు సైతం ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపిన జనసేనాని

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తాను క్రమంగా కోలుకుంటున్నానని వెల్లడించారు. ఇటీవల హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో శనివారం నాడు శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. పవన్ కల్యాణ్ కొంతకాలంగా సైనసైటిస్ సమస్యతో బాధపడుతున్నట్టు తెలుస్తోంది. సర్జరీ విజయవంతమైన నేపథ్యంలో తన ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని ఆకాంక్షించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సినీ ప్రముఖులతో పాటు యావత్ ప్రజానీకానికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పలువురు నేతల ట్వీట్లకు స్పందిస్తూ, తన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన

- మిగతా2లో




## పారదర్శకంగా ఉన్నాం.. ప్రజలకు వాస్తవాలు చేరవేయండి

- పార్టీ ముఖ్య నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపు
- ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమం, అభివృద్ధిలో రాజీపడటం లేదు
- శిక్షణా తరగతులతో లీడర్-కేడర్ మధ్య భావోద్వేగ బంధం
- ఈ నెల 29న టీడీపీ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ
- ప్రజలే ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలి: సీఎం

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్ర ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో పనిచేస్తోందని, ఈ వాస్తవాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, ప్రత్యర్థులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సంక్షేమం, అభివృద్ధి, ప్రభుత్వ సేవల విషయంలో తాము అనుసరిస్తున్న పారదర్శక విధానాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత నేతలపై ఉందని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న పార్టీ ముఖ్య నేతలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, తాజా రాజకీయ పరిణామాలపై సమీక్షించారు.రాష్ట్రం ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ, వాటిని ఒక్కొక్కటిగా అధిగమిస్తూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ముందుకెళుతున్నామని చంద్రబాబు వివరించారు. ఈ కష్టాన్ని, ప్రభుత్వం పడుతున్న శ్రమను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు. ప్రభుత్వంపైనా, కూటమి పార్టీలపైనా కొందరు పనిగట్టుకుని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, వివిధ మార్గాల ద్వారా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఈ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని స్పష్టం చేశారు.

"ప్రజలకు వాస్తవాలు తెలిస్తే వారే విశ్లేషించుకుంటారు. పరిపాలనలో ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని వారికి వివరిస్తే, ప్రత్యర్థుల కుట్రలను తిప్పికొట్టేలా ప్రజలే ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారతారు" అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. గత ఎన్నికల్లో నాటి ప్రభుత్వం ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినా, ప్రజలు వాస్తవాలను గ్రహించి కూటమికి అద్భుతమైన విజయాన్ని అందించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేయడమే మన ప్రధాన బాధ్యత అని ఆయన అన్నారు.పార్టీలో నేతలకు, కార్యకర్తలకు మధ్య భావోద్వేగ బంధాన్ని బలోపేతం చేసేందుకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు, 'కాఫీ కబుర్లు' వంటి కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయని చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తరగతుల ద్వారా పార్టీ సిద్ధాంతాలను వివరించడంతో పాటు, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఫీడ్‌బ్యాక్ తీసుకునే అవకాశం కలుగుతోందని తెలిపారు. పార్టీ కార్యకర్తల కుటుంబాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, వారి విద్య, వైద్యం, ఉపాధి కోసం 'ఎథిక్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్' అనే వ్యవస్థను సమగ్రంగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు.ఈ నెల 29వ తేదీన పార్టీ నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించనుందని, దీనికి సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయని నేతలు ముఖ్యమంత్రికి తెలియజేశారు. అలాగే, త్వరలో జరగనున్న మహానాడు నిర్వహణ కమిటీల ఏర్పాటుపైనా కసరత్తు చేస్తున్నట్టు సీఎంకు వివరించారు.





ఒప్పందానికి ఒప్పుకోకపోతే

## విధ్వంసమే..

### ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక!

- ఇరాన్‌లోని ప్రతి విద్యుత్ కేంద్రం, వంతెనను కూల్చేస్తామన్న అమెరికా
- సోమవారం ఇస్లామాబాద్‌లో ఇరు దేశాల మధ్య మరో విడత చర్చలు
- హర్మూజ్ జలసంధిలో కాల్పుల విరమణను ఇరాన్ ఉల్లంఘించిందని ఆరోపణ
- విఫలమైన గత చర్చల తర్వాత పశ్చిమాసియాలో పెరిగిన ఉద్రిక్తతలు

- మిగతా2లో

## పవన్ కల్యాణ్ గారూ... మీరు త్వరగా కోలుకోవాలి

- శస్త్రచికిత్స చేయించుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- ఆయన త్వరగా కోలుకోవాలంటూ ఆకాంక్షించిన జగన్
- సోషల్ మీడియా వేదికగా స్పందించిన మాజీ సీఎం
- హైదరాబాద్‌లో పవన్‌కు విజయవంతంగా ముగిసిన సర్జరీ

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ శనివారం సాయంత్రం శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో, వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ స్పందించారు. పవన్ త్వరగా, సంపూర్ణంగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ

- మిగతా2లో



## హైదరాబాద్ పోలీసుల 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0'.. దేశవ్యాప్తంగా 52 మంది అరెస్ట్

- అరెస్టయిన వారిలో 32 మంది బ్యాంకు అధికారులు
- 9 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించిన 16 ప్రత్యేక బృందాలు
- మ్యూల్ ఖాతాలు తెరవడంలో అధికారుల పాత్ర ఉన్నట్లు నిర్ధారణ
- ఫిబ్రవరిలో జరిగిన ఆపరేషన్ ఆక్టోపస్-1కు ఇది కొనసాగింపు

- మిగతా2లో





## చెన్నై సూపర్ 6...

### 20 పాయింట్ల ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేసిన స్టాలిన్

- చెన్నై జిల్లాకు 'సూపర్ 6' పేరుతో ప్రత్యేక మేనిఫెస్టో
- ఆరు కీలక రంగాల్లో 20 ప్రధాన ప్రకటనలు
- 1000 కొత్త మినీ బస్సులు, ఏఐ ఆధారిత ట్రాఫిక్ వ్యవస్థ
- మౌలిక వసతుల ప్రాజెక్టులకు కచ్చితమైన గడువులు
- రూ.10,000 కోట్లతో గ్లోబల్ సెంటర్, 20,000 ఉద్యోగాల కల్పన

**పెన్ పవర్ డెస్క్:**తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, చెన్నై జిల్లాను లక్ష్యంగా చేసుకుని 'చెన్నై సూపర్ 6' పేరుతో ఒక ప్రత్యేక ఎన్నికల మేనిఫెస్టోను ఆదివారం విడుదల చేశారు. నగర మౌలిక సదుపాయాలు, రవాణా, పట్టణ సౌకర్యాలు, భవిష్యత్ ఆర్థిక వృద్ధి వంటి ఆరు కీలక రంగాల్లో మొత్తం 20 హామీలను ఇందులో పొందుపరిచారు.పట్టణ రవాణా వ్యవస్థను మెరుగుపరచడంలో భాగంగా, చివరి మైలు కనెక్టివిటీ కోసం 1,000 కొత్త మినీ బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు డీఎంకే హామీ ఇచ్చింది.

- మిగతా2లో



## తమిళనాడులో ఘోర విషాదం...

### బాణసంచా పరిశ్రమలో పేలుడు, 18 మంది మృతి

- తమిళనాడు విరుధునగర్‌లో భారీ పేలుడు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆందోళన
- దుర్ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం స్టాలిన్
- సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశం

- మిగతా2లో

## నేడు చంద్రబాబు పుట్టినరోజు...

### అన్న క్యాంటీన్ల కు రూ.76 లక్షల విరాళం ఇచ్చిన నారా భువనేశ్వరి

- ఏప్రిల్ 20న పుట్టినరోజు జరుపుకోనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- నేడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 269 అన్న క్యాంటీన్లలో పేదలకు ఉచితంగా భోజనం
- ఈ ఏడాది మీ పుట్టినరోజు బహుమానం ఇదే" అంటూ ఆమె చంద్రబాబుకు భువనేశ్వరి విషెస్
- అర్ధాంగిని అభినందించిన సీఎం చంద్రబాబు

- మిగతా2లో



## రంగులు మార్చడంలో నరేంద్ర మోదీజీ అభినవ ఊసరవెల్లి

- మహిళా బిల్లుపై ప్రధాని మోదీ రంగులు మారుస్తున్నారని షర్మిల విమర్శ
- రిజర్వేషన్ల అమలుకు డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం కుట్రేనని ఆరోపణ
- చట్టాన్ని వెంటనే అమలు చేసి 543 స్థానాలకు వర్తింపజేయాలని డిమాండ్
- 2029 లోపు కులగణన, శాస్త్రీయ పునర్విభజన పూర్తి చేయాలని సవాల్

**పెన్ పవర్ డెస్క్:**మహిళా రిజర్వేషన్ బిల్లు విషయం లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినవ ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్నారని, 33 శాతం రిజర్వేషన్ల అమలుకు అసలు ద్రోహి ఆయనేనని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో

- మిగతా2లో



# క్రమంగా కోలుకుంటున్నాను.. మీ అందరి ఆదరణకు కృతజ్ఞతలు

- మొదటి పేజి తరువాయి

సోదరుడు, మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందించారు. "కల్యాణ్ బాబుకు వైద్య ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ప్రస్తుతం ఆయన క్షేమంగా, నిలకడగా కోలుకుంటున్నారు. వైద్యుల సూచన మేరకు, సాధారణ కార్యకలాపాల్లోకి తిరిగి రావడానికి సుమారు వారం రోజులు పట్టవచ్చు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మీ అందరి ప్రేమకు, ప్రార్థనలకు ధన్యవాదాలు" అని చిరంజీవి పేర్కొన్నారు. దీనికి పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "ధన్యవాదాలు అన్నయ్య. మీ ప్రేమ, ఆశీస్సులు, నిరంతర సంరక్షణకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ మాటలు వెచ్చదనాన్ని, రక్షణను, బలాన్ని ఇస్తాయి. మీ ఆశీస్సులతో త్వరలోనే కోలుకుని తిరిగి ప్రజాసేవకు వస్తాను" అని బదులిచ్చారు.

మరో సోదరుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు కూడా పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. "మన ప్రియతమ నాయకుడు పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతమైంది. ఆయన కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుని, నూతన శక్తితో తిరిగి వస్తారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని మనమందరం ప్రార్థిద్దాం" అని పోస్ట్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి కూడా పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఎక్స్ లో పోస్ట్ చేశారు. దీనికి పవన్ స్పందిస్తూ, "నా ఆరోగ్యం, కోలుకోవడం కోసం మీరు తెలిపిన శుభాకాంక్షలకు ధన్యవాదాలు వైఎస్ జగన్ గారూ. నేను క్రమంగా కోలుకుంటున్నాను. మీ ఆదరణకు కృతజ్ఞుడను" అని బదులిచ్చారు. వీరితో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నారాయణ, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పవన్ కల్యాణ్ కోలుకోవాలం తమ సందేశాల్లో పేర్కొన్నారు. సినీ పరిశ్రమ నుంచి జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, సాయి ధరమ్ తేజ్ వంటి ప్రముఖులు కూడా ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అందరి ప్రేమ, ఆప్యాయతలకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఆరోగ్యం నిలకడగా ఉందని, పూర్తి విశ్రాంతి అనంతరం త్వరలోనే విధుల్లో చేరతారని జనసేన వర్గాలు తెలిపాయి.

## ఎడిటర్ వ్యూ

### తెలుగు ఓటర్లే టార్గెట్.. ఎన్డీఏకి మద్దుతగా రంగంలోకి చంద్రబాబు

తమిళనాడు ఎన్నికలకు కీలక దశకు చేరుకున్నాయి. మరో నాలుగు రోజుల్లో పోలింగ్ జరగనుండగా, మంగళవారంతో ఎన్నికల ప్రచారం ముగియనుంది. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంట్రీ ఇస్తున్నారు. రెండు రోజుల పాటు తమిళనాడులో ఎన్నికల ప్రచారం చేసేందుకు ఎన్డీఏ తరపున చంద్రబాబు పర్యటిస్తున్నారు. సోమ, మంగళవారాల్లో ఆయన తమిళనాడులో పలు బహిరంగ సభలు, రోడ్ షోలు నిర్వహించనున్నారు. చంద్రబాబు ఎన్నికల ప్రచారం రాజకీయంగా ఆసక్తిరేపుతోంది.

తమిళనాడులో ఎన్డీఏ కూటమి తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారం చేయనున్నారని టీడీపీ వర్గాలు ప్రకటించాయి. ఈ మేరకు సీఎం టూర్ ను అధికారికంగా ధ్రువీకరించారు. సోమవారం మధ్యాహ్నం రాజధాని అమరావతి నుంచి చంద్రబాబు నేరుగా కోయంబత్తూరు వెళ్లనున్నారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కోయంబత్తూరు, హోసూరు, చెన్నై, ఆవడి ప్రాంతాల్లో పర్యటిస్తారు. ముఖ్యంగా తెలుగు ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సభలు, రోడ్ షోలకు ఏర్పాట్లు చేశారు. చంద్రబాబు పర్యటన సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. హోసూరు సమీపంలో తాలిలో భారీ బహిరంగ సభ నిర్వహణకు ప్లాన్ చేశారు. ఈ ప్రాంతంలో తెలుగు వాళ్లు అధికంగా నివసిస్తున్నట్లు చెబుతున్నారు. ఇక చెన్నైకి సమీపంలో ఆవడిలో చంద్రబాబు రోడ్ షో కి రూట్ మ్యాప్ రెడీ చేశారు. ఇక చంద్రబాబు రాకను స్వాగతిస్తూ ఎన్డీఏ అభ్యర్థులు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. చెన్నై టీడీపీ కూడా చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయడానికి విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఏపీ-తమిళనాడు సరిహద్దుల్లో తెలుగు మాట్లాడేవారు అధికంగా నివసిస్తున్నారు. అంతేకాకుండా చెన్నై, కోయంబత్తూరు, తిరుచ్చి వంటి నగరాల్లో తెలుగు మాట్లాడే వారి జనాభా ఎక్కువగా ఉందని అంచనా. తమిళనాడులో దాదాపు 40 శాతం మంది తెలుగు సంతతికి చెందిన ఓటర్లే ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి. దీంతో ఈ ఎన్నికల్లో పలువురు తెలుగు నేతలకు ప్రధాన పార్టీలు టికెట్లు ఇచ్చాయి. ఇక ఎన్డీఏ భాగస్వామిగా ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబును బీజేపీ రంగంలోకి దింపిందని అంటున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో అత్యంత సీనియర్ నేతగా చంద్రబాబు ప్రభావం ఉంటుందని ఎన్డీఏ నేతలు భావిస్తున్నారు. అంతేకాకుండా చంద్రబాబుకు తమిళనాడుతో ఉన్న అనుబంధం, ఏపీ నుంచి వచ్చి తమిళనాడులో స్థిరపడిన ఓటర్లను ఆకర్షించడానికి చంద్రబాబు ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో కూడా చంద్రబాబు మహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించారు. ఆ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. తాజాగా సరిహద్దు రాష్ట్రమైన తమిళనాడులో చంద్రబాబును ప్రత్యేకంగా తీసుకువెళ్లడం హాట్ టాపిక్ గా మారింది.

### పవన్ కల్యాణ్ గారూ... మీరు త్వరగా కోలుకోవాలి

- మొదటి పేజి తరువాయి

సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పవన్ కల్యాణ్ కు నిన్న హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ సర్జరీ విజయవంతం అయిందని, ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారని తెలిసింది. ఈ క్రమంలో పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు, అభిమానులు ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగిరావాలని సోషల్ మీడియా వేదికగా ఆకాంక్షలు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలోనే జగన్ కూడా స్పందించారు. "పవన్ కల్యాణ్ గారు శస్త్రచికిత్స అనంతరం త్వరగా, సంపూర్ణంగా కోలుకోవాలని ఆశిస్తున్నాను" అని తన పోస్టులో జగన్ పేర్కొన్నారు.

## హైదరాబాద్ పోలీసుల 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0'.. దేశవ్యాప్తంగా 52 మంది అరెస్ట్

దేశవ్యాప్తంగా విస్తరించిన భారీ సైబర్ మోసాల నెట్‌వర్క్‌ను హైదరాబాద్ నగర పోలీసులు ఛేదించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0' పేరుతో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భాగంగా 9 రాష్ట్రాల్లో 32 మంది బ్యాంకు అధికారులతో సహా మొత్తం 52 మందిని అరెస్టు చేశారు. ఈ వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఆదివారం మీడియాకు వెల్లడించారు.

వారం రోజుల పాటు 16 ప్రత్యేక పోలీసు బృందాలు మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్ రాష్ట్రాల్లో ఏకకాలంలో ఈ ఆపరేషన్ నిర్వహించాయి. అరెస్టయిన వారిలో సైబర్ నేరగాళ్లకు సహకరించిన 32 మంది బ్యాంకు అధికారులు, మోసపూరిత లావాదేవీల కోసం తమ ఖాతాలను వాడటానికి అనుమతించిన 15 మంది మ్యూల్ ఖాతాదారులు, నేరగాళ్లకు ఈ ఖాతాలను అందించే ఐదుగురు మధ్యవర్తులు ఉన్నారు. ఇండస్‌ఇండ్ బ్యాంకుకు చెందిన ఆరుగురు, బంధన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన ఐదుగురు చొప్పున, ఫెడరల్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకుకు చెందిన నలుగురు చొప్పున అధికారులతో పాటు మరో ఐదు ప్రైవేట్ బ్యాంకులకు చెందిన అధికారులు కూడా అరెస్టయిన వారిలో ఉన్నారు. నిందితుల నుంచి 26 మొబైల్ ఫోన్లు, 14 చెక్ బుక్కులు, ఒక ల్యాప్‌టాప్, 21 షెల్ కంపెనీ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు.

పెట్టుబడుల మోసాలు, ట్రేడింగ్ ఫ్రాడ్స్, 'డిజిటల్ అరెస్ట్' వంటి సైబర్ నేరాలు పెరిగిపోవడంతో ఈ ఆపరేషన్ చేపట్టామని సజ్జనార్ తెలిపారు. ఫిబ్రవరి 2026లో 'ఆపరేషన్ ఆక్టోపస్-1' ద్వారా రూ. 150 కోట్ల లావాదేవీలకు సంబంధించిన 117 మందిని అరెస్ట్ చేశామని, దానికి కొనసాగింపుగా బ్యాంకు అధికారులను లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ ప్రారంభించామని వివరించారు. సరైన కేవైసీ ధృవీకరణ లేకుండానే మ్యూల్ ఖాతాలు తెరుస్తూ సైబర్ నేరగాళ్లకు ప్రైవేట్ బ్యాంకులు సహకరిస్తున్నట్లు తమ దర్యాప్తులో తేలిందని కమిషనర్ పేర్కొన్నారు.

## తమిళనాడులో ఘోర విషాదం...

తమిళనాడులో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. విరుధునగర్ జిల్లా, కట్టనార్‌పట్టిలోని ఓ బాణసంచా ఫ్యాక్టరీలో ఆదివారం భారీ విస్ఫోటనం సంభవించింది. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 18 మంది కార్మికులు మరణించినట్లు తెలుస్తోంది.

ప్రమాద తీవ్రతకు మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీలో ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. అయితే, విస్ఫోటనానికి దారితీసిన కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు.

ఈ దుర్ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. "కట్టనార్‌పట్టి బాణసంచా ఫ్యాక్టరీలో జరిగిన విస్ఫోటనంలో పలువురు మరణించారన్న వార్త తీవ్ర వేదనకు గురిచేసింది" అని ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసులను సీఎం స్టాలిన్ ఆదేశించారు. బాధితుల కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారు. జిల్లా కలెక్టర్‌తో కూడా మాట్లాడి, అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

## రంగులు మార్చడంలో నరేంద్ర మోదీజీ అభినవ ఊసరవెల్లి

- మొదటి పేజి తరువాయి

ధ్వజమెత్తారు. నారీశక్తి ముసుగులో డీలిమిటేషన్ బిల్లును తెరపైకి తెచ్చిన కపట సూత్రధారి మోదీ అని, ఇప్పుడు ప్రతిపక్షాలపై పెడబొబ్బలు పెడుతూ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆమె విమర్శించారు.

సోషల్ మీడియాలో ఆమె స్పందిస్తూ.. "2023లో పార్లమెంట్ ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని వెంటనే అమలు చేయకుండా, దానికి నియోజకవర్గాల పునర్విభజనతో లింకు పెట్టాల్సిన అవసరం ఏమొచ్చింది? మళ్లీ సవరణ బిల్లు తెచ్చి, ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని బీద ఏడుపులు ఎందుకు? రాజకీయ స్వలాభం కోసం విపక్షాలపై శాపనార్థాలు పెట్టడం దేనికి?" అని ప్రధానిని సూటిగా ప్రశ్నించారు.

ప్రధాని మోదీకి మహిళల ఆత్మగౌరవంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, 'నారీ శక్తి వందన్ అధినియమ్-2023' చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్‌తో ఎలాంటి సంబంధం లేకుండా ప్రస్తుతమున్న 543 పార్లమెంట్ స్థానాల్లోనే మహిళా రిజర్వేషన్లు పాటించాలని కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అత్యంత శాస్త్రీయంగా జరగాలని షర్మిల అభిప్రాయపడ్డారు. "ముందుగా 2026 జనాభా లెక్కలు అందుబాటులోకి రావాలి. ఆ తర్వాత కులగణన జరిపి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల జనాభా తేల్చాలి. ఈ గణాంకాల ఆధారంగానే డీలిమిటేషన్‌లో రిజర్వేషన్లు కేటాయించాలి. వెనుకబడిన కులాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి న్యాయం చేయాలి. చిన్న రాష్ట్రాల వాదనలను పరిగణనలోకి తీసుకొని ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపాలి. బీజేపీకి దమ్ముంటే 2029 ఎన్నికలలోపు ఈ ప్రక్రియ మొత్తం పూర్తి చేయాలి" అని ఆమె సవాల్ విసిరారు.

"శాశ్వత అధికారం కోసం రాజ్యాంగాన్ని మార్చాలన్న బీజేపీ కుతంత్రాన్ని అడ్డుకోవడంలో విపక్షాలు విజయం సాధిస్తే, ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు మహిళలను అడ్డుపెట్టుకుని మోదీ మాట్లాడటం సిగ్గుచేటు. 2029 ఎన్నికల్లో లబ్ధి కోసం రాష్ట్రాల సమైక్యతను దెబ్బతీయాలని చూస్తే విపక్షం గుణపాఠం చెబుతుంది" అని షర్మిల హెచ్చరించారు.

చేతనైతే మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేసి చూపాలని, శాస్త్రీయ పద్ధతిలో పునర్విభజన చేపట్టాలని ప్రధాని మోదీకి, మతతత్వ బీజేపీకి, ఎన్డీఏ పక్షాలకు కాంగ్రెస్ పార్టీ తరపున సవాల్ విసురుతున్నానని ఆమె స్పష్టం చేశారు.

## ఒప్పందానికి ఒప్పుకోకపోతే విధ్వంసమే..

- మొదటి పేజి తరువాయి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌కు మరోసారి తీవ్రమైన హెచ్చరికలు జారీ చేశారు. ఒప్పందానికి అంగీకరించకపోతే ఇరాన్‌లోని ప్రతి విద్యుత్ కేంద్రాన్ని, ప్రతి వంతెనను నాశనం చేస్తామని స్పష్టం చేశారు. అయితే, ఇదే సమయంలో ఇరు దేశాల మధ్య చర్చల కోసం రేపు (ఏప్రిల్ 20న) అమెరికా ప్రతినిధి బృందం పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌కు వెళ్లనుందని వెల్లడించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "మేం చాలా న్యాయమైన ఒప్పందాన్ని ప్రతిపాదిస్తున్నాం. దానికి వారు అంగీకరిస్తారని ఆశిస్తున్నాం. ఒకవేళ ఒప్పుకోకపోతే, ఇరాన్‌లోని ప్రతి విద్యుత్ కేంద్రాన్ని, ప్రతి వంతెనను అమెరికా కూల్చేస్తుంది. ఇకపై మంచిగా వ్యవహరించేది లేదు" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరాన్ హంతక యంత్రాంగాన్ని అంతం చేసే సమయం వచ్చిందని, గత 47 ఏళ్లుగా ఇతర అధ్యక్షులు చేయలేని పనిని తాను చేస్తానని అన్నారు. గతంలో ఏప్రిల్ 11న ఇస్లామాబాద్‌లో పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిలిపివేయాలని అమెరికా డిమాండ్ చేయగా, తమపై విధించిన ఆంక్షలు ఎత్తివేసి, స్తంభింపజేసిన ఆస్తులను విడుదల చేయాలని ఇరాన్ కోరింది. ఆ చర్చలు విఫలమవ్వడంతో హర్మూజ్ జలసంధిలో అమెరికా నావికాదళ దిగ్బంధనం విధించగా, దానికి ప్రతిగా ఇరాన్ ఆ జలసంధిని మూసివేసింది. కాగా, హర్మూజ్ జలసంధిలో ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ట్రంప్ ఆదివారం ఆరోపించారు. ఫ్రాన్స్, బ్రిటన్‌కు చెందిన నౌకలపై ఇరాన్ కాల్పులు జరిపిందని తెలిపారు. జలసంధిని మూసివేయడం వల్ల ఇరాన్‌కే రోజుకు 500 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతుందని అన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన నేపథ్యంలో సోమవారం జరగనున్న చర్చలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## నేడు చంద్రబాబు పుట్టినరోజు...

### అన్న క్యాంటీన్ల కు రూ.76 లక్షల విరాళం ఇచ్చిన నారా భువనేశ్వరి

రాష్ట్రంలో పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు, అన్నం పెట్టే అమ్మను తలపిస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి అన్నారు. రేపు (ఏప్రిల్ 20) ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆమె అన్న క్యాంటీన్లకు రూ.76 లక్షల భారీ విరాళాన్ని ప్రకటించారు. ఈ విరాళంతో రేపు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 269 అన్న క్యాంటీన్లలో పేదలకు ఉచితంగా భోజనం అందించనున్నారు. శనివారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో అన్న క్యాంటీన్ సీఈవోకు ఆమె చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ.. లక్షల మంది పేదల కడుపు నింపే మహోన్నత కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించడం ఎంతో గొప్ప విషయమన్నారు. కేవలం రూ.5 లకే అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో, గౌరవంగా భోజనం అందించడం అభినందనీయమని కొనియాడారు. రోజువారీ కూలీలు, నిరుపేదలు ఈ పథకం ద్వారా ఎంతో లబ్ధి పొందుతున్నారని, ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. చంద్రబాబు పుట్టినరోజున పేదల కడుపు నింపే కార్యక్రమానికి విరాళం ఇవ్వడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఆమె పేర్కొన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కన్నా మించిన సంతృప్తి మరొకటి ఉండదని, తాను పలు సందర్భాల్లో అన్న వితరణలో పాల్గొన్నప్పుడు కలిగిన అనుభూతిని గుర్తుచేసుకున్నారు. తమ మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా కూడా 12 ఏళ్లుగా ఏటా తిరుమల అన్నప్రసాదానికి రూ.44 లక్షలు విరాళంగా ఇస్తున్న విషయాన్ని ఆమె ప్రస్తావించారు. "ఈ ఏడాది మీ పుట్టినరోజుకు మేమిచ్చే బహుమానం ఇదే" అంటూ ఆమె చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మరోవైపు, తన పేరు మీద అన్న క్యాంటీన్లకు ఒక రోజు అన్నదానానికి భారీ విరాళం ఇచ్చిన అర్ధాంగి భువనేశ్వరిని ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రాష్ట్రంలో అన్నదాన కార్యక్రమాన్ని ఒక గొప్ప యజ్ఞంలా ముందుకు తీసుకెళుతున్నాం. తిరుమలలో భక్తుల సహకారంతో నాలుగు దశాబ్దాలుగా అన్నదానం జరుగుతోంది. అదే స్ఫూర్తితో అన్న క్యాంటీన్ల సేవలను మరింత విస్తరించాలి" అని అన్నారు. నాణ్యతను పాటిస్తూ, పవిత్రంగా, గౌరవంగా ఆహారం అందించే ఈ కార్యక్రమానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి ప్రత్యేక సందర్భాల్లో భోజనానికి అయ్యే ఖర్చును విరాళంగా ఇచ్చేందుకు ప్రజలు ముందుకు రావాలని, తద్వారా ఈ కార్యక్రమం ఒక స్ఫూర్తిదాయక బ్రాండ్‌గా మారాలని ఆకాంక్షించారు.

## చెన్నై సూపర్ 6... 20 పాయింట్ల ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేసిన స్టాలిన్

- మొదటి పేజి తరువాయి

ఈ బస్సులు వీధులను బస్టాప్‌లు, మెట్రో స్టేషన్లు, రైల్వే హబ్‌లతో కలుపుతాయి. దీనికి తోడు, ట్రాఫిక్ రద్దీని తగ్గించి, ప్రయాణ సమయాన్ని 25 శాతం వరకు తగ్గించేందుకు ఏఐ (ఏఐ) ఆధారిత ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను తీసుకొస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. కీలకమైన మౌలిక వసతుల ప్రాజెక్టుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించారు. ఎన్నూర్ నుంచి పూంజేరి వరకు చెన్నై పెరిఫెరల్ రోడ్ ప్రాజెక్టుతో సహా పదికి పైగా ప్రధాన పథకాలను 2027 నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. మెట్రో రైలు విస్తరణ, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులను 2028 నాటికి, భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టులను 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2029 నాటికి ప్రపంచ స్థాయి రహదారి మౌలిక వసతులను కల్పిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్ ఆర్థిక వ్యవస్థను దృష్టిలో ఉంచుకుని, రూ.10,000 కోట్ల పెట్టుబడితో 'గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఏఐ, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ వంటి రంగాలపై దృష్టి సారించే ఈ కేంద్రం ద్వారా 20,000 అధిక వేతన ఉద్యోగాలను సృష్టిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు, వీధికుక్కల సమస్యకు శాస్త్రీయ పరిష్కారంగా, యానిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమాన్ని బలోపేతం చేస్తామని, వెటర్నరీ వైద్యులు, డాగ్ క్యాచర్ల సంఖ్యను మూడు రెట్లు పెంచుతామని తెలిపారు. వీటితో పాటు, మెట్రో వాటర్ కనెక్షన్లు లేని ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు, అన్ని నివాస ప్రాంతాల్లో హై-ఇంటెన్సిటీ వీధి దీపాలు వంటి హామీలను కూడా ఈ మేనిఫెస్టోలో పొందుపరిచారు.

# ఎదురుచూపులు...






- కూలీ డబ్బుల కోసం ఎదురుచూస్తున్న ఉపాధి కూలీలు
- మూడు నెలలుగా కూలీ డబ్బులు రాక ఆందోళన
- అయ్యవార్లకు ఆగని జీతభత్యాలు
- పనుల వద్ద కూలీలకు భద్రతకరు
- తాగు నీరు, సేద తీరేందుకు కానరాణి సదుపాయాలు
- సమస్యలు తీరేది ఎప్పుడు? ప్రశ్నిస్తున్న కూలీలు

**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్, 19:**వలస కూలీలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశంలో ఎంపిక చేసిన రాష్ట్రాలలో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఇటీవల కూలీలకు శాపంగా మారుతుంది. పొట్ట కూటి కోసం ఉపాధి పనులకు పోదామంటే డబ్బులు రాక మరోపక్క ఇతర ప్రాంతాలకు వలస పోదామంటే కుదరదాయే అన్నట్లు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వహణ కనిపిస్తోంది. గత మూడు నెలలుగా కూలీ డబ్బులు రాక ఉపాధి కూలీలు దిక్కు తోచని స్థితిలో కనిపిస్తున్నారు. కడుపునిండా తిండి లేక ఇతర పనులకు పోదామంటే ఓపిక లేక ఉపాధి పనులనే నమ్ముకున్న కూలీలు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో కనిపిస్తున్నారు. ఒక్క గండేపల్లి మండలంలోని 18 గ్రామాలలో 10572 జాబ్ కార్డులు ఉండగా పూర్తిస్థాయిలో సంబంధిత అధికారులు పనులు చూపించలేకపోవడం విశేషం. వేసవికాలం నడుస్తున్న పూర్తిస్థాయి గ్రామాలలో పనులు అధికారులు కల్పించకపోవడం పై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు . రామయ్య పాలెం, తాళ్లూరు, నీలాద్రి రావు పేట తదితర గ్రామాలలో నేటికీ సంబంధిత అధికారులు పనులు కల్పించకపోవడంపై పనులు కోసం కూలీలు ఎదురుచూస్తున్నారు. అయ్యవార్లకు ఆగని జీతభత్యాలు కూలీలు పనులకు డబ్బులు రాక అలాంటిస్తుంటే అధికారులకు మాత్రం ప్రభుత్వం నుండి ప్రతినెలా జీతాలు రావడం గమనార్హం. ఎవరు ఏమైతే మాకేంటి మాపై సజావుగానే జరుగుతుంది కదా అన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ఉపాధి కూలీలు సహనం వెళ్లబుచ్చుతున్నారు. ఇది ఇలాగే జరిగితే ఉపాధి పనులకు పోవడం సాధ్యం కాదని ప్రత్యామ్నాయ పనులకు ప్రయత్నించక తప్పదని, అంతేకాకుండా పొట్టకూటి కోసం వలస పోయే పరిస్థితి ఉంటుందని పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. కూలి డబ్బులు రాక పోవడంపై ఎలా ఉన్నప్పటికీ తప్పని పరిస్థితుల్లో ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు ప్రభుత్వం, అధికారులు నుండి రక్షణ కరువైందని పలువురు వాపోతున్నారు. గతంలో ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు పూర్తి రక్షణ కలిగిస్తూ కూలీ పని చేసే ప్రదేశాలలో టెంట్లతో పాటు త్రాగునీరు, మజ్జిగ అందించే వారిని అవి ఏమి ఇప్పుడు లేకపోవడం దారుణమని పలువురు చెబుతున్నారు. కూలీలకు భద్రత లేనప్పుడు వెంటనే కి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి కూడా ఉందని దానిని ప్రభుత్వము, అధికారులు గుర్తిరిగి కూలీలకు భద్రత కల్పించాలని పలువురు కూలీలు కోరుతున్నారు. అంతేకాకుండా సమయానికి కూలి డబ్బులు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇప్పటికైనా ఉన్నత సంబంధిత అధికారులు స్పందించి కూలి పనులకు డబ్బులు చెల్లించటంతో పాటు భద్రత కల్పించాలని కోరుతున్నారు.

గండేపల్లి ఏపీవో కృష్ణంరాజు ఫోన్ ద్వారా వివరణ

కూలీలకు జనవరి నెలాఖరు వరకు కూలి డబ్బులు చెల్లించడం జరిగిందని నాటినుండి నేటి వరకు కూలీ సొమ్ములు చెల్లించలేదన్నారు. అధికారులకు జీతాలు యధావిధిగా అదుతున్నాయని తెలిపారు. మండలంలో పూర్తిస్థాయిలో ఉపాధి పనులు సోమవారం నుండి ప్రారంభం కానున్నట్లు తెలిపారు.




## జన గణన జనాభా లెక్కల మాత్రమే కాదు మన దేశ ప్రగతికి పునాది.

- జనగణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.
- ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఏప్రియల్ 19:** జన గణన అంటే కేవలం జనాభా లెక్కల మాత్రమే కాదని,ఇది మన దేశ ప్రగతికి పునాది అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా అన్నారు. ఆదివారం ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా మాట్లాడుతూ జనగణన లేదా సెన్సస్ ప్రక్రియ అంటే కేవలం జనాభా లెక్కలు మాత్రమే కాదని,ఇది మన దేశ ప్రగతికి పునాది అని ఎమ్మెల్యే అన్నారు

ప్రతి పదేళ్లకు ఒకసారి జరిగే ఈ కార్యక్రమం ద్వారా మన ప్రాంతాల్లోని పరిస్థితులు, జనాభా వివరాలు, మరియు ప్రజల జీవన ప్రమాణాలను ప్రభుత్వం అంచనా వేస్తుందన్నారు.కాబట్టి జనగణన ప్రక్రియను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. జనాభా లెక్కల ప్రాతిపదికన మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రూపొందించడం జరుగుతుందన్నారు. జనాభా లెక్కల ప్రకారం ఆసుపత్రులు పాఠశాలలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.




మే ఒకటి నుండి 30 వరకు మీరు స్వయంగా మీ మొబైల్ ఫోన్ ద్వారా 'సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు.ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.


మే 1 నుండి ఎన్యుమరేటర్లు మరియు వివిధ ప్రభుత్వ విభాగాల సిబ్బంది నేరుగా మీ గ్రామాలకు, ఇళ్లకు వచ్చి వివరాలను సేకరిస్తారన్నారు.ఈ సమావేశంలో తహసీల్దార్ ఎం సూర్యప్రభ పలువురు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల భివృద్ధికి కృషి చేసిన సర్పంచ్‌లకు ఘన సన్మానం





**తణుకువాడ, మంజేరు, ఒంటి తాడి సర్పంచ్‌ల సేవలకు ప్రశంసలు**

**రామచంద్రపురం, పెన్ పవర్,ఏప్రిల్ 19:**కాజులూరు మండల పరిధిలో ఐదేళ్లపాటు సర్పంచ్‌లుగా సేవలందిస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన తణుకువాడ గ్రామ సర్పంచ్ నరాల సుబ్బరాజు, మంజేరు గ్రామ సర్పంచ్ గుంటూరి అప్పారావు, ఒంటి తాడి గ్రామ సర్పంచ్ నెల్లి బ్రహ్మాజీ తదితరులను ఆదివారం ఘనంగా సన్మానించారు.వారి పదవీకాలం ఇటీవల ముగియడంతో, ద్రాక్షారామంలో ఏర్పాటు చేసిన ఓ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ , నియోజకవర్గ కన్వీనర్ పిల్లి సూర్య ప్రకాష్, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు మెమెంటోలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి, ప్రజా సేవలో సర్పంచ్‌లు చూపిన నిబద్ధత అభినందనీయమని కొనియాడారు. గ్రామస్థాయి పాలనలో వారి పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాజులూరు జెడ్పీటీసీ వనుం వెంకట సుబ్బారావు,ఎంపీపీ మాత భారతీ మురళితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ర్యాలి గ్రామంలో చెట్ల నరికి వేయింపు వివాదం -







- అనుమతుల దుర్వినియోగమా?
- ప్రజల్లో ఆగ్రహం, ఆందోళన

**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 19:**ఆత్రేయపురం మండలం పరిధిలోని ర్యాలి గ్రామం నుంచి ఊబలంక వెళ్లే ప్రధాన రహదారిపై భారీగా చెట్ల నరికి వేయడం స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. రోడ్డు అండ్ బిల్డింగ్స్ (ఆర్ అండ్ బి) అధికారుల అనుమతులు కొద్ది చెట్లకే పరిమితమైనప్పటికీ, వాస్తవానికి అనుమతికి మించి చెట్లు తొలగించారని గ్రామ ప్రజలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఘటన పర్యావరణ పరిరక్షణ, ప్రభుత్వ అనుమతుల పారదర్శకతపై కీలక ప్రశ్నలను లేవనెత్తుతోంది.గ్రామస్థుల వివరాల ప్రకారం, అధికారికంగా సుమారు 8 చెట్లను మాత్రమే తొలగించేందుకు అనుమతి ఇచ్చినప్పటికీ, యాంత్రిక పరికరాల సహాయంతో అదనంగా మరిన్ని చెట్లు నరికివేయబడ్డాయి. రహదారి ఇరువైపులా ఉన్న పెద్ద, పాత చెట్లు

పూర్తిగాతొలగించబడటంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో, చెట్ల నీడ లేక ప్రజలు నేరుగా ఎండకు గురవుతున్నారు.ఈ చెట్లు గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా నాటబడినవిగా, సంవత్సరాలుగా పెరిగి గ్రామానికి సహజ వాతావరణాన్ని అందిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అలాంటి చెట్లను ఒక్కసారిగా తొలగించడం పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలి కాలుష్యం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో చెట్ల కొరత ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.గ్రామస్థులు ఈ విషయంపై ప్రశ్నించగా, సంబంధిత సిబ్బంది "మా దగ్గర అనుమతి ఉంది" అంటూ సమాధానం ఇచ్చారని చెబుతున్నారు. అయితే తరువాత ఆర్ అండ్ బి విభాగానికి చెందిన మైల్కార్ కె. బాబురావు స్పందిస్తూ, "మేము కొన్ని చెట్లకే అనుమతి ఇచ్చాం, మిగతా చెట్లకు ఇవ్వలేదు" అని స్పష్టం చేయడం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసింది. ఇది అనుమతుల అమలు విధానంలో లోపాలున్నాయా? లేక అనుమతుల పేరుతో అధికంగా చెట్లు తొలగించబడ్డాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో చెట్ల తొలగింపు వంటి చర్యలు అధికారుల సమక్షంలోనే జరగాలని, అలాగే నరికివేసిన ప్రతి చెట్టుకు బదులుగా కనీసం రెండు మొక్కలు నాటాలని కోరుతున్నారు. అడవి శాఖ తక్షణమే స్పందించి రహదారి ఇరువైపులా పునర్వనం కార్యక్రమం చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రస్తుతం ఈ ఘటన స్థానికంగా మాత్రమే కాకుండా పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా కూడా ప్రాధాన్యత



సంతరించుకుంది. బాధ్యులపై చర్యలు తీసుకోవడమే కాకుండా, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన నియంత్రణలు అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# మండలంలో అగ్నిమాపక వారోత్సవాలు

✸ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది






**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రియల్, 19:**అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గండేపల్లి మండలం జెడ్ రాగంపేట పరిధి, నీలాద్రి రావు పేట పరిధిలోగల కార్తికేయ హాస్పిటల్, సాయి హాస్పిటల్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తదితర ప్రదేశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ వారి అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా జగ్గంపేట అగ్నిమాపక కేంద్రంలో ఆరవ రోజు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం అగ్నిమాపక కేంద్రం నుండి , అగ్నిమాపక అధికారి, సిబ్బంది, వాహనం తో బయలుదేరి వెళ్ళి అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు పై అవగాహన కల్పించి అగ్ని ప్రమాదాలు ఏర్పడినప్పుడు వాటిని ఎలా నివారించాలో డెమో చేసి చూపించడం జరిగినది. తదుపరి ఆయా ప్రాంతాలలో కరపత్రాలను పంచడమయినది .ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఫైర్ ఆఫీసర్ ఆర్, చంద్ర శేఖర్ పి, శ్రీనివాస రావు , కే వి వి శేఖర్ , డి నానాజీ , ఎన్ వి ఎస్ నారాయణ , ఎం సురేష్ డి వెంకటేష్ పాల్గొన్నారు

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు అడ్డంకులు సరికాదు: సంపతి కనకేశ్వరరావు



**కొత్తపేట, పెన్ పవర్, ఏప్రిల్19:**కొత్తపేట మండలంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు దేశంలో మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంపుపై కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సమర్థించారు. దేశంలోని శాసనసభలు, పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో,ఇండియా కూటమి సహా ప్రతిపక్షాలు మహిళా రిజర్వేషన్ బిల్లుకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నాయని ఆయన విమర్శించారు. ఇది దేశంలోని మహిళలను అవమానించడమే అవుతుందని అన్నారు. ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాలు మహిళలకు ప్రాధాన్యతనిస్తూ ముందంజలో ఉన్నాయని, అదే విధంగా భారతదేశంలో కూడా మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

మహిళా బిల్లును అడ్డుకోవడంపై దేశవ్యాప్తంగా మహిళా సంఘాలు అసంతృప్తిగా ఉన్నాయని, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలు ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం సమాజ అభివృద్ధికి కీలకమని సంపతి కనకేశ్వరరావు అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా దేశంలోని మహిళలు తమ హక్కుల కోసం చైతన్యంతో ముందుకు రావాలని, మహిళా సాధికారతకు అందరూ తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో పోషన్ పక్వాడ





**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ 19:**గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు ఎన్.ఎస్.ఎస్. కార్యక్రమాలలో భాగంగా పులిమేరు గ్రామం లో అర్హులైన పేదలకు బలాన్ని ఇచ్చే పౌష్టికాహారాన్ని, అవసరమైన పప్పు దినుసులను, ముడి సరుకులను పంచారు. తదనంతరం పోషన్ పక్వాడ ప్రోగ్రాం ద్వారా విద్యార్థిని విద్యార్థులు పులిమేరు అంగన్వాడి సెంటర్లో తల్లులకు మరియు పిల్లలకు పోషకాహార విలువలను గురించి వివరించారు. సరియైన పోషకాహారాలు కలిగిన ఆహారం పిల్లలను, వారి యొక్క ఆరోగ్యాన్ని, వారి యొక్క రోగనిరోధక శక్తిని పెంపొందించుతుందని అవగాహన కల్పించారు. పిల్లలు సరైన రీతిలో ఎదగాలి అంటే, అనారోగ్యం బారీన పడకుండా ఉండాలంటే ఆరోగ్యకరమైన ఆహారం ఎంతో అవసరం అని తల్లులకు వివరించారు. పాలిచ్చే తల్లులు మరియు నెలలు నిండిన పిల్లలు కలిగిన తల్లులు మంచి ఆహారం తీసుకోవడం ద్వారా బిడ్డకు సరైన పోషక ఆహారం అందించిన వారమవుతాం అని చంటి పిల్లలు పాలు విడిచే వరకు సరైన ఆహారం తల్లులు ద్వారా రోగ నిరోధక శక్తిని నెలల పిల్లల్లో పెంచిన వారమవుతావు అని కూడా వివరించారు.అంగన్వాడి సెంటర్ లో ఉన్న పిల్లల యొక్క బరువును, పొడవును కొలిచారు. సరియైన ఆహారం తీసుకోలేని పిల్లలకు , మరియు తక్కువ బరువు ఉన్న పిల్లలకు మల్టీ విటమిన్ సిరప్, విటమిన్ సి పల్లి చిక్కిలు వంటివి ఉచితంగా పంచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ పిల్లలకు, వృద్ధులకు పోషక విలువలతో కూడిన ఆహారం ఎంతో బలాన్ని, రోగ నిరోధక శక్తిని కలిగిస్తుందని వివరించారు. ఈ ప్రోగ్రాంలో సర్పంచ్ తుమ్మల సురేఖ , సచివాలయం మహిళా పోలీస్ కె. జ్ఞాన సుందరి, అంగన్వాడీ టీచర్లు ఏలేటి.చక్రమహాలక్ష్మి గారు, అల్లం నూకరత్నం తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ ప్రోగ్రాం లో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎస్ శృతి మరియు విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## దూలపల్లి జీవన్ కుమార్ కు మురళీకృష్ణంరాజు పరామర్శ.



✸ పదివేల రూపాయలు ఆర్థిక సహాయం.అందజేత.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఏప్రియల్ 19:** ప్రత్తిపాడు నియోజకవర్గం రౌతులపూడి మండలం గుమ్మరేగుల గ్రామానికి చెందిన దూలపల్లి జీవన్ కుమార్ ను ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి నేత, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణరాజు ఆదివారం పరామర్శించారు.జీవన్ కుమార్ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలుకి ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మురళీకృష్ణంరాజు

జీవన్ కుమార్ ని పలకరించి ఆరోగ్యం పరిస్థితులు అడిగి తెలుసుకోవడమే కాకుండా, 10,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయనతోపాటు గుమ్మరేగుల సర్పంచ్ రాపర్తి రామకృష్ణ జీవన్ కుమార్ కు 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ నిరుపేద కుటుంబానికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో యాదల నాగేశ్వరరావు, పెనుగొండ సత్యనారాయణ,కొప్పిరెడ్డి రాజు,మాడుగుల శ్రీను,రాపర్తి దుర్గ,గాడి నూకరాజు,పప్పల సింహాచలం,మాజీ వైస్ సర్పంచ్ కొంగుపూడి బొజ్జాలు ,బత్తుల సత్యనారాయణ,బత్తుల బాబ్జి,బొల్లు నాగేశ్వరరావు,జువ్వల దొరబాబు,దోమలంక బాబ్జి, వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గుబ్బాలమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలి.

-ప్రముఖ పారిశ్రామిక వేత్త, సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ.





**కిర్లంపూడి, పెన్ పవర్, ఏప్రియల్, 19:** శ్రీ గుబ్బాలమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, గొప్ప ఆధ్యాత్మికపరుడు, సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ అన్నారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామంలో వేంచేసియున్న శ్రీ గుబ్బాలమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. జాతర మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీ గుబ్బాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న సంపర సుధాకర శ్రీ వినాయక వర్మకు ఆలయ కమిటీ సభ్యులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ అమ్మవారి అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్న ప్రసాదములు వడ్డించారు. ఈ సందర్భంగా సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ మాట్లాడుతూ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల సహకారంతో గ్రామ దేవత శ్రీ గుబ్బాలమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించడమే కాకుండా, వేలాది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో చిల్లంగి, కిర్లంపూడి, జగపతినగరం,గ్రామాలతో పాటు, చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదములు స్వీకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ఆలయం కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## 20న కాకినాడలో యథావిధిగా పీజీఆర్ఎస్,

# రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు

**కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 19:**ప్రజా సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించాలి

జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్

కాకినాడ జిల్లాలో ఏప్రిల్ 20వ తేదీ సోమవారం పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమం జిల్లా స్థాయిలో సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కాకినాడ కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించబడుతుందని తెలిపారు. రెవెన్యూ అంశాలకు సంబంధించిన రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం అదే సమయంలో వివేకానంద హాల్‌లో నిర్వహించబడుతుందని చెప్పారు.

జిల్లా స్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా ఈ కార్యక్రమాలకు హాజరై ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు.ఇప్పటికే దాఖలు చేసిన అర్జీలు పరిష్కారం కాలేదా, లేదా తమ ఫిర్యాదుల స్థితి గురించి తెలుసు కోవాలనుకునే వారు 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కోరారు.అర్జీదారులు తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవడానికి వీవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌ను వినియోగించవచ్చని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో కూడా పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయని పేర్కొన్నారు.ప్రజలు తమ ఫిర్యాదులను సమీపంలోని డివిజన్, మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ సూచించారు.

# సోమవరంలో ఘనంగా అరుణోదయ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు.

**కిర్లంపూడి, పెన్ పవర్, ఏప్రియల్,19:**కిర్లంపూడి మండలం సోమవరం గ్రామంలో అరుణోదయ స్కూలు తొమ్మిదవ వార్షికోత్సవ వేడుకలు కరస్పాండెంట్ భాను,శ్రీపతి లీల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి నాయకులు జంపన రవి వర్మ, ,పేపకాయల చెల్లయమ్మ ట్రస్ట్ ప్రెసిడెంట్ రామిశెట్టి రామకృష్ణ, ట్రెజరర్ పేపకాయల చంటిబాబు, సోమవరం మాజీ సర్పంచ్ జ్యోతుల సీతారామలక్ష్మి సూతి శ్రీను, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు మంచి కంటి శ్రీను, అడబాల నాగు, మత్స మంగారావు , పేపకాయల బుజ్జి యువసేన సభ్యులు ప్రభాకర్, కుర్రా రాజు విచ్చేశారు గౌరవ అతిథులుగా ఎన్ సి ఆర్ కోచింగ్ సెంటర్ నీలం చక్రధర్, వివేకానంద స్కూలు కరస్పాండెంట్ వానపల్లి గంగాధర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా

చక్రధర్, గంగాధర్ తదితరులు మాట్లాడుతూ

విద్యార్థులు మొబైల్ ఫోన్ కు బానిసలు కావడంతో విద్యా ప్రమాణాలు తగ్గుతున్నాయన్నారు. పేరెంట్స్ విద్యార్థులకు మొబైల్ ఫోన్ ను దూరంగా ఉంచాలని కోరారు. అబ్దుల్ కలాం లాంటి వారిని






ఆదర్శంగా తీసుకుని చదువులో బాగా రాణించి ఉన్నత భవిష్యత్తులో శిఖరాల నిర్వహించాలన్నారు.కార్పోరేట్ సంస్థలకు దీటుగా ఇక్కడ అరుణోదయ స్కూల్లో అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని స్కూలు యాజమాన్యం భాను, శ్రీపతి లీలను కొనియాడారు. చదువులో మొదటి మరియు ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం మెమొంటోలు అందజేశారు. తమ పాఠశాలలో సెవెంత్ చదివిన విద్యార్థికి ఎన్.ఎం.ఎం.ఎస్ లో స్కాలర్షిప్ లభించడం గర్వకారణం అని తెలిపారు. అలాగే పేపకాయల చెల్లయమ్మ ట్రస్ట్ వారు తమ పాఠశాలలో పేద విద్యార్థులకు సహాయం అందిస్తున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులచే నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నాటికలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది,విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# శ్రీ గుబ్బాలమ్మ తల్లి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న తుమ్మలపల్లి రమేష్.





**పవన్ కళ్యాణ్ ఆరోగ్యం మెరుగుపడాలని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు.**

**కిర్లంపూడి, పెన్ పవర్, ఏప్రియల్, 19:** కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామంలో వేంచేసియున్న శ్రీగుబ్బాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని పురస్కరించిన నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదములు వడ్డించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ తమ ప్రియతమ నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఆయన త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు

ఈ కార్యక్రమంలో గంధం ప్రభాకర్, దాడి చిన్న బుజ్జి, కాళ్ళ వెంకటేష్, దాడి రాజగోపాల్, బొడ్డేటి రాజు, ఎడ్ల కృష్ణ, దిడ్డి చిట్టిబాబు, చిక్కాల కల్కి భగవాన్, నాగపోయిన శివ, ఎల్ వి వి సత్యనారాయణ, సలగాల చక్రధర్, అంజిబాబు, దాడి చిన్ని, బుద్ధ వెంకన్న బాబు, బుద్ధ శివ, కాయల మణికంఠ, కొలమూరి భద్ర, వంశీ తదితరులు పాల్గొన్నారు


02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్

కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు '

'పో. 12 సెం.మీ. వె.16 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


## చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించాలి. జగదీశ్వరి.





**పోలవరం, పెన్ పవర్, ఏప్రిల్ 19.** టిడిపి అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ నిర్వాహకురాలు కొవ్వాసు జగదీశ్వరి టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. పోలవరం లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ టిడిపి అధినేతగా పార్టీని రాష్ట్ర ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో చంద్రబాబు నడిపిస్తున్నారని కొనియాడారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని ఆయన నాయకత్వంలో రాష్ట్రం దినదిన అభివృద్ధి చెందుతుందన్నారు. గొప్ప గొప్ప ప్రాజెక్టులను రాష్ట్రానికి తీసుకు రావడంతో పాటు అనేకమైన బృహత్తర కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారన్నారు. అటువంటి మహోన్నతమైన వ్యక్తి యొక్క పుట్టినరోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించాలని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు మద్దతుగా టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఐక్యతతో పలు సేవా కార్యక్రమాలను చేపట్టవలసిన బాధ్యత మనపై ఉందన్నారు. మా వంతు కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని చేగొండపల్లి పార్టీ కార్యాలయంలో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ తో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ముఖ్యంగా మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలని ఉద్దేశంతో వారి ఆర్థిక స్వలంభావన కోసం మహిళలకు శ్రీయుత ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు బి విజయ్ నాయక్ పుట్టినరోజు వేడుకలు సందర్భంగా రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో కేక్ కటింగ్ మిఠాయిలు పంపిణీ వృద్ధులు, పేదలకు సహాయ సహకారాలు అందించే కార్యక్రమం సైతం నిర్వహించనున్నట్లు జగదీశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు.





**పెన్ పవర్, ఉంగుటూరు -- ఏప్రిల్ 19:** చేబ్రోలు రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం వల్ల నారాయణపురం, చేబ్రోలు గ్రామాల నిర్వాసితులకు ఎలాంటి నష్టం రాకుండా రైల్వే అధికారులతో మాట్లాడతానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ భరోసా ఇచ్చారు.

విజయవాడ--విశాఖ రైలు మార్గంలో చేబ్రోలు వద్ద నిర్మించ తలపెట్టిన ఫ్లైఓవర్ కారణంగా నారాయణపురం గ్రామానికి చెందిన వందలాది మంది తమ భూములు, నివాస గృహాలు, వ్యాపార సంస్థలను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో సుమారు 200 మంది బాధితులు ఆదివారం ఏలూరులోని ఎంపీ నివాసానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. తాము చిరు వ్యాపారాలు, రోజువారీ కూలీలపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నామని, వంతెన కోసం భూములు తీసుకుంటే రోడ్డున పడే పరిస్థితి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

దీనిపై స్పందించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ వెంటనే సంబంధిత రైల్వే శాఖ అధికారులతో మాట్లాడి ప్రత్యామ్నాయ రూట్ మ్యాప్ రూపొందించాలని సూచించారు. చేబ్రోలు, నారాయణపురం గ్రామాల భూములు తీసుకోవద్దని రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేస్తానని తెలిపారు.

మీ భూములకు ఎలాంటి నష్టం జరగదని, ఎవ్వరూ ఆందోళన చెందవద్దని ఎంపీ బాధితులకు హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా బాధితులు ఎంపీకి ధన్యవాదాలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో మహిళలు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

## సోమవరంలో ఘనంగా అరుణోదయ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు.





**కిర్లంపూడి, పెన్ పవర్, ఏప్రియల్,19:** కిర్లంపూడి మండలం సోమవరం గ్రామంలో అరుణోదయ స్కూలు తొమ్మిదవ వార్షికోత్సవ వేడుకలు కరస్పాండెంట్ భాను,శ్రీపతి లీల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి నాయకులు జంపన రవి వర్మ, ,పేపకాయల చెల్లయమ్మ ట్రస్ట్ ప్రెసిడెంట్ రామిశెట్టి రామకృష్ణ, ట్రెజరర్ పేపకాయల చంటిబాబు, సోమవరం మాజీ సర్పంచ్ జ్యోతుల సీతారామలక్ష్మి సూతి శ్రీను, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు మంచి కంటి శ్రీను, అడబాల నాగు, మత్స మంగారావు , పేపకాయల బుజ్జి యువసేన సభ్యులు ప్రభాకర్, కుర్రా రాజు విచ్చేశారు గౌరవ అతిధులుగా ఎన్ సి ఆర్ కోచింగ్ సెంటర్ నీలం చక్రధర్, వివేకానంద స్కూలు కరస్పాండెంట్ వానపల్లి గంగాధర్ హాజరయ్యారు. ఈ సందర్బంగా చక్రధర్, గంగాధర్ తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్ కు బానిసలు కావడంతో విద్యా ప్రమాణాలు తగ్గుతున్నాయన్నారు. పేరెంట్స్ విద్యార్థులకు మొబైల్ ఫోన్ ను దూరంగా ఉంచాలని కోరారు. అబ్దుల్ కలాం లాంటి వారిని ఆదర్శంగా తీసుకుని చదువులో బాగా రాణించి ఉన్నత భవిష్యత్తులో శిఖరాల నిర్వహించాలన్నారు. కార్పోరేట్ సంస్థలకు దీటుగా ఇక్కడ అరుణోదయ స్కూల్లో అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని స్కూలు యాజమాన్యం భాను, శ్రీపతి లీలను కొనియాడారు. చదువులో మొదటి మరియు ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం మెమొంటోలు అందజేశారు. తమ పాఠశాలలో సెవెంత్ చదివిన విద్యార్థికి ఎన్.ఎం.ఎం.ఎస్ లో స్కాలర్షిప్ లభించడం గర్వకారణం అని తెలిపారు. అలాగే పేపకాయల చెల్లయమ్మ ట్రస్ట్ వారు తమ పాఠశాలలో పేద విద్యార్థులకు సహాయం అందిస్తున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులచే నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నాటికలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది,విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీ ఏగులమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలి.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్,19:** శ్రీ ఏగులమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ప్రతిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అన్నారు. ప్రత్తిపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ శ్రీ శ్రీ ఏగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ఆలయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మాట్లాడుతూ ఆ అమ్మవారి కృపా కటాక్షములు ఎల్లవేళలా ప్రజలందరిపైనా ఉండాలని, ఆ అమ్మవారి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

# నిలువెత్తు నిర్లక్ష్యం.. పట్టించుకోని అధికారులు




**సీతానగరం, పెన్ పవర్, ఏప్రిల్ 19:** ప్రజల ప్రాణాలను రక్షించవలసిన అధికారులే తమకు ఏమి పట్టనట్లు వ్యవహరించడంతో ఆ రోడ్డులో ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిందే అని వాహనదారులు వాపోతున్నారు. వివరాలకు వెళితే రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలం నుండి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం నగరాన్ని అనుసంధానం చేస్తూ నూతనంగా నిర్మించిన నాలుగు లైన్ల ప్రధాన రహదారిని ఇప్పుడు ఆ గ్రామ రైతులు గ్రామ పెద్దలు సొంత పనులకు వినియోగిం

చడంతో ఆ రహదారిపై రైతులు ధాన్యం కల్లాలు ఏర్పాటు చేసుకోనే వారు గత నాలుగు రోజుల క్రితం రహదారిపై ప్రమాదాలు జరగడంతో రాపాక తూముల వద్ద రెండు ద్విచక్ర వాహనాలు గాయాలయ్యాయి. ఒకరు మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి . రైతులకు నోటీసులు ఇచ్చి ధాన్యం ఆరబోస్తే కేసులు నమోదు చేస్తామని. నోటీసులు ఇచ్చారు అయిన అక్కడ ఉన్న మట్టి గుట్టను అధికారులు ఇంకాతొలగించకపోవడంతో ప్రభుత్వ శాఖల అధికారులు అసలు ప్రజల ప్రాణాలు అంటే లెక్కలేని విధంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే తూతూ మంత్రంగా అధికారులు మొక్కుబడిగా మీటింగ్లు పెట్టి మామ అనిపించారు. మట్టి గుట్టను మాత్రం తొలగించలేకపోయారు. ఈ మట్టిగుట్టను తొలగిస్తారా ఆ రైతుకు అధికారులు కొమ్ము కాస్తారా అనేది వేచి చూడాలి.

# కనకమహాలక్ష్మి ఆలయానికి రూ.9.87 లక్షల నిధులు

**ఎమ్మెల్యే బండారు చొరవతో విడుదలైన నిధులు**




**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 19;**ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న నిధులు చివరకు విడుదలయ్యాయి. గత ప్రభుత్వ కాలంలో మంజూరైనప్పటికీ అమలుకాక నిలిచిపోయిన గ్రాంట్‌ను తిరిగి సాధించి, స్థానిక ప్రజల ఆశలను నెరవేర్చడంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కీలక పాత్ర పోషించారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు ద్వారా ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణాలకు, గ్రామాల్లో భక్తి పెంపొందించేందుకు ఆర్థిక సహకారం అందిస్తుంది. ఈ క్రమంలో ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి రూ. 9.87 లక్షల నిధులు విడుదలయ్యాయి. ఈ నిధుల కోసం గత ప్రభుత్వ కాలంలోనే దరఖాస్తు చేసినప్పటికీ, అప్పట్లో అనేక హామీలు ఇచ్చినా నిధులు విడుదల కాలేదు. దీంతో ఆలయ అభివృద్ధి పనులు నెమ్మదించాయి. అయితే ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రత్యేక చొరవ తీసుకుని, అధికారులను సమన్వయం చేస్తూ ఈ గ్రాంట్ విడుదలకు కృషి చేయడం విశేషంగా నిలిచింది. మంజూరైన రూ. 9.87లక్షల చెక్కును ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతుల మీదుగా, డీసీ చైర్మన్ మెర్ల గోపాలస్వామి ఆధ్వర్యంలో ఆలయ కమిటీకి అందజేశారు. ఇప్పటికే ఆలయ నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో ఈ నిధులు మరింత అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడనున్నాయి. ఎమ్మెల్యే చొరవతో నిలిచిపోయిన నిధులు విడుదల కావడంతో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## కృత్రిమ మేధస్సుతో గుండె వైద్యంలో ఆధునిక చికిత్స

**ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సీఎంఈ విజయవంతం**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 19:**గుండె సంబంధిత వ్యాధుల ముందస్తు గుర్తింపు, ఖచ్చితమైన నిర్ధారణ, సముచిత చికిత్సలో కృత్రిమ మేధస్సు (ఏఐ) కీలక పాత్ర పోషిస్తోందని వైద్య నిపుణులు స్పష్టం చేశారు. ఈ అంశంపై ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నగర శాఖ సహకారంతో "ఏఐ ఇన్ కార్డియాలజీ --- ఫ్రమ్ ఎర్లీ డిటెక్షన్ టు టైమ్లీ ఇంటర్వెన్షన్" అనే నిరంతర వైద్యవిద్యా కార్యక్రమం (సీఎంఈ) స్థానికంగా హాటల్లో ఆదివారం జరిగింది. అనంతరం ఆస్టర్ రమేష్ హాస్పిటల్ కు చెందిన సీనియర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ పోతినేని రమేష్ బాబు మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ప్రధాన మరణ కారణాల్లో గుండె జబ్బులు ఒకటిగా మారుతున్న నేపథ్యంలో, ఆరోగ్య వ్యక్తుల్లో కూడా గుండె సమస్యలు నిగూడంగా వృద్ధి చెందుతా యన్నారు. ఈ సున్నిత సంకేతాలను ముందుగానే గుర్తించడంలో ఏఐ సాంకేతిక పరిజ్ఞానం కీలకంగా దోహదపడుతోందన్నారు. సి టి ఎఫ్ ఎఫ్ ఆర్ తో ముందస్తు నిర్ధారణ, శీఘ్ర నిర్ణయాలు, వ్యక్తిగత చికిత్స రోగుల ఫలితాలు మెరుగు పడుతున్నా యన్నారు. రమేష్ హాస్పిటల్స్ లో అమలులో ఉన్న టెలి ఐసీయూ వ్యవస్థ ఉందని, సెంట్రల్ కమాండ్ స్టేషన్ నుంచి ఎక్కడైనా ఆసుపత్రుల్లోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్లను మానిటర్ చేయడం సాధ్యమవుతోందని డాక్టర్ రమేష్ బాబు తెలిపారు. గుండె వైద్యంలో ఏఐ వినియోగం వల్ల ఈసీజీ, స్కాన్లు, ల్యాబ్ రిపోర్టుల డేటాను విశ్లేషించి గుండె వ్యాధుల ప్రమాదాన్ని ముందుగానే హెచ్చరించ వచ్చానన్నారు. ఎకో, సీటీ యాంజియోగ్రామ్, కార్డియాక్ ఎంఆర్ఐ పరీక్షల్లో చిన్న బ్లాకేజీలను సైతం ఖచ్చితంగా గుర్తించడం, యాంజియోప్లాస్టీ, స్టెంటింగ్ సమయంలో రియల్ టైమ్ డేటాతో సురక్షితమైన చికిత్స అందించ వచ్చానన్నారు. రోగి జీవనశైలి, జన్యు లక్షణాల ఆధారంగా వ్యక్తిగత చికిత్స సూచించడం, అత్యవసర పరిస్థితులను తగ్గించడం వంటి అంశాలు ఈ సదస్సులో చర్చించా రన్నారు. తొలుత ముఖ్య అతిథులుగా పాల్గొన్న జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ, వైద్యులు నైపుణ్యం పెంపొందించు కోవాలంటే వైద్యశాస్త్రంలో నిరంతరం వస్తున్న కొత్త ఆవిష్కరణలను అవగాహన చేసుకోవడం అత్యవసరమనిసూచించారు. 100కు పైగా వైద్యవిద్యా కార్యక్రమాలు నిర్వహించిన ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సదస్సులో డాక్టర్ రాజా రమేష్, డాక్టర్ అనూప్, డాక్టర్ రామ్ మనోహర్, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ భరత్ సిద్ధార్థ, డాక్టర్ కార్తికేయ, డాక్టర్ రవికాంత్ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ ఎవి సుబ్బారావు, ఐఎంఏ నగర శాఖ అధ్యక్షుడు డాక్టర్ విజయ భాస్కర్, కార్యదర్శి డాక్టర్ సతీష్, ట్రెజరర్ డాక్టర్ దుర్గాప్రసాద్ సమన్వయంతో ఈ వైద్యవిద్యా సదస్సు లో ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఈ సదస్సులో కార్డియాల జిస్టులు, వైద్యులు, క్రిటికల్ కేర్ నిపుణులు, పీజీ విద్యార్థులు సుమారు 400 మంది పాల్గొని ఆధునిక వైద్య విధానాలపై చర్చించారు. .

## రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు అనుకూల వాతావరణం



**రూరల్ శాసన సభ్యులు గోరంట్ల**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 19:**రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగవంతంగా అమలవుతున్నాయని, పెట్టుబడులు ఆకర్షితమవు తున్నాయని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఆదివారం తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడుల ఆకర్షణకు అనుకూల వాతావరణం ఏర్పడిందని, వివిధ రంగాల్లో పురోగతి సాధించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. తన కృషిని గుర్తించి పోలిట్ బ్యూరో సభ్యునిగా మూడోసారి అవకాశం కల్పించారని, పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర రాజధాని అభివృద్ధి దిశగా ప్రణాళికాబద్ధంగా పనులు కొనసాగుతున్నాయన్నారు. ప్రాంతీయ అభివృద్ధి సమతుల్యంగా ప్రభుత్వ ప్రణాళికలు అమలవుతు న్నాయని వివరించారు.జనాభా గణన కార్యక్రమాల్లో ప్రజల సహకారం అవసరమని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి ఆరోగ్యం మెరుగుప డుతోందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా 35 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 31 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అందజేశారు. ఈ కార్యక్రమంలో , , రూరల్ మండలం తెదేపా అధ్యక్షులు మత్సేటి శివ సత్య ప్రసాద్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ వేమన నారాయణ గౌడ్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాన్ని సత్యనారాయణ, గంగిన హనుమంతరావు, చప్పా చిన్నారావు, నిమ్మలపూడి రామకృష్ణ, పిల్ల తనూజ, దుద్దుపూడి రమేష్, బొప్పన నానాజీ, శీలం గోవిందు, రొంపిచర్ల ఆంటోనీ, పాఠంశెట్టి రాంజీ, ముప్పిడి రాంబాబు, బొప్పన శ్రీను, పుక్కళ్ల రాజు, చిచ్చారి సుబ్బారావు, గుర్రపు సత్యనారాయణ, తూము శ్రీను, , నాగిరెడ్డి రామకృష్ణ, మర్రెడ్డి రమేష్, , వరగోగుల వెంకటేశ్వరరావు, చెక్కపల్లి మురళీకృష్ణ, కోరాడ వెంకటేష్, లాజర్, కక్కల రమేష్, చిట్టిబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్సీ సోము



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 19:**ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు, కుటుంబ సభ్యులకు ఆదివారం శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అత్యవసర వైద్య చికిత్సలు, ప్రమాదాలు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయం అందించడం ఉద్దేశ్యమన్నారు. ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం అండగా నిలుస్తూ, వారి జీవితాల్లో భరోసా కల్పించేం దుకు ఈ నిధి కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ప్రజలు అవసరమైన సమయంలో సిఎంఆర్ఎఫ్‌ను వినియోగించు కోవాలని, అర్హులైన వారికీ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. జిల్లాకు చెందిన బొమ్ముల దత్తు, పిక్కి నాగేంద్ర, కురగంటి సతీష్, బి. వెంకటేష్ తదితరులకు రూ. 5,18,070 విలువైన సహాయాన్ని ఎనిమిది చెక్కులు అందించారు. లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి కృషి



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, ఏప్రిల్ 19;** తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నూతనంగా ఎంపికైన ఆలయ కమిటీ మెంబర్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి, మాజీ జెడ్పిటిసి గడ్డ మణుగు రవికుమార్ ఆదివారం జీలుగుమిల్లిలో ఒక ప్రకటనలో తెలిపారు. జనసేన పార్టీ బలోపేతానికి అహిర్నిశలు కృషి చేసినందుకు గాను అధిష్టానం గుర్తించి ఈ పదవి దక్కబెట్టిందని తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా తోపాటు పోలవరం నియోజకవర్గం లోని ప్రతి గ్రామంలో జనసేన పార్టీ గుర్తింపుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అసెంబ్లీ ఎన్నికలలో కూడా పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాలలో జనసేన పార్టీ ఆవిర్భావ నుండి తన వంతు పార్టీ కోసం పనిచేసినట్లు తెలిపారు. అందుకు ప్రతిఫలంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఏలూరు జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, పోలవరం ఎమ్మెల్యే సిరి బాలరాజు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్ రాజు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు కోటికలపూడి చినబాబు, డిసిసిబి మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కరాటం సాయి లకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలోనే ఉన్న నాయకులకు కార్యకర్తలకు నాకు సహకరించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా జనసేన పార్టీ తరపున ఏ పదవి ఇచ్చిన గానే దానికి తగినంత న్యాయం చేస్తానని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని జనసేన పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

# గీత కార్మిక వర్గాల ఆరాధ్యుడు గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం



**రాజమహేంద్రవరం, ఏప్రిల్ 19:**స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాలకు ఆరాధ్యుడు గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయమని శెట్టిబలిజ, గౌడ సంషేం సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బుడ్డిగ శ్రీనివాస్ అన్నారు. గౌతు లచ్చన్న 20 వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక వై జంక్షన్ వద్ద ఉన్న విగ్రహానికి నగర శాఖ ఆధ్వర్యం పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బుడ్డిగ మాట్లాడుతూ, గౌతు లచ్చన్న జీవితం గీత కార్మికులకు స్ఫూర్తిదాయకమన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలోను, అనంతరం చేసిన త్యాగాలు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం ఆదర్శప్రాయమన్నారు. కూల వివక్షత అంటరానితనం నిర్మూలన, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన పోరాటం అజరామన్నారు. ఆయన అందించిన మార్గంలో సంఘీయులు ప్రయాణిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అధ్యక్షుడు రెడ్డి రాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా గుర్తించి నిర్వహించాలని నిర్ణయించి, ఆయన సేవలను అధికారికంగా గుర్తించిందన్నారు. గీత కార్మికుల సంక్షేమ సారధి గౌతు లచ్చన్న జిందాబాద్, గౌతు లచ్చన్న వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, గేద అన్నపూర్ణ రాజు, గెద్దాడ హరిబాబు, సూరంపూడి శ్రీహరి, పిల్లి నిర్మల, వల్లు ప్రకాష్ రావు, బుడ్డిగ రవి, పంపన శ్రీనివాసు , టేకుమూడి బద్రీనాథ్, గుత్తుల రామచంద్రరావు, గొర్రెల రమణ, అనం చంటి, సూరంపూడి అప్పారావు, వళ్ళు గోవిందు, రేలంగి శ్రీను కట్టా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# సామాజిక సామరస్యత, స్వదేశీ భావన, పౌర బాధ్యతలపై చైతన్యం

- నడింపల్లి ఆయుష్
- ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుక లో నడింపల్లి ఆయుష్




**రాజమహేంద్రవరం, పెన్ పవర్,ఏప్రిల్ 19:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) శతాబ్ది సంవత్సరం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా 'వైభవ భారతం--దృష్టి--దిశ' అంశంపై ప్రముఖుల సమావేశం స్థానిక మంజీర హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్లు, శాస్త్రవేత్తలు, విద్యా , వ్యాపార,ఆధ్యాత్మిక వేత్తలు, మేధావులు తదితర పాల్గొన్నారు. ముఖ్య వక్తగా పాల్గొన్న ఆర్ ఆర్ ఎస్ నాయకుడు, నడింపల్లి ఆయుష్ మాట్లాడుతూ,ఆరెస్సెస్ శతాబ్ది కార్యక్రమాలు గ్రామాలు, పట్టణాల లో సమాజంతో అనుసంధానం పెంచే దిశగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. . 'వ్యక్తితో పాటు సమాజం మారితేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన స్పష్టంచేసారు. సనాతన ధర్మం మానవజాతికి మార్గదర్శకమైన విలువల సమాహారం , సమానత్వం విలువలు ప్రపంచ శాంతికి పునాదిగా నిలుస్తాయన్నారు. వసుధైవ కుటుంబకం భావన భారతీయ సంస్కృతికి ప్రత్యేకత' అని ఆయుష్ తెలిపారు. ఆరెస్సెస్ కార్యకర్తలు ప్రపంచంలోని అనేక దేశాలలో ఉన్నారు.ఆయా దేశాలలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వివిధ కార్యకలాపాలు నిర్వహిస్తు న్నారన్నారు. సంఘంలో మహిళల పాత్ర లేదనే అభిప్రాయం తప్పని, కుటుంబ స్థాయిలో మహిళలు భాగస్వాముల వుతున్నారని ఆయుష్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వ్యవహారాల్లో సంఘ్ ప్రత్యక్ష జోక్యం ఉండదని అయన స్పష్టం చేశారు. ప్రచారం కంటే పనులకు సంఘ్ ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టంచేసారు. సోషల్ మీడియాను సానుకూలంగా వినియోగించుకోవాలని సూచించారు. సామాజిక సమరసత, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ భావన, పౌర బాధ్యతలపై చైతన్యం కలిగి ఉండాలని ఆయుష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోదావరి విభాగ సంఘ్ చాలకులు మంతెన రామచంద్ర రాజు, పోలవరం జిల్లా సంఘ్ చాలకులు సార్ల చిన్నారెడ్డి పాల్గొన్నారు. వోలేటి సత్యనారాయణ, ముళ్ళపూడి జగన్, విభాగ ప్రచారక్ సోము తదితరులు పాల్గొన్నారు.

## బాపిరాజుకు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే బొలిశెట్టి.



**తాడేపల్లి గూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 19.** తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షునిగా ఎంపికైన ముళ్ళపూడి బాపిరాజుకు తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అభినందనలు తెలియజేశారు. నల్లజర్లలో బాపిరాజు నివాసంలో శనివారం ఈ అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయ నాయకుడిగా బాపిరాజు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని, ఆయన సేవకులకు తగిన గుర్తింపు లభించిందని అన్నారు. బాపి రాజు మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# మరో యుద్ధం తప్పదా..? కిమ్ జోంగ్ పంపుతున్న హెచ్చరికలు అర్థం అదేనా..?

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచం మొత్తం పశ్చిమాసియా యుద్ధంపై దృష్టి సారించిన వేళ, కిమ్ జోంగ్ ఉన్ మళ్లీ తన క్షిపణి ప్రయోగాలతో తూర్పు ఆసియాలో 'రెడ్ అలర్ట్' ప్రకటించేలా చేస్తున్నారు. ఆదివారం ఉదయం సిన్పో తీరం నుంచి జరిగిన ఈ ప్రయోగాలు కేవలం ఆయుధ పరీక్షలు మాత్రమే కాదు, అవి దక్షిణ కొరియా, జపాన్ దేశాల సహనాన్ని పరీక్షిస్తున్న హెచ్చరికలు.

**వరుస క్షిపణులతో కిమ్ జోంగ్ ఉన్ అలజడి..**

అంతర్జాతీయ సమాజం ఎన్ని ఆంక్షలు విధించినా, ఐక్యరాజ్యసమితి ఎన్ని తీర్మానాలు చేసినా ఉత్తర కొరియా తన పంథాను మార్చుకోవడం లేదు. తాజాగా ఆదివారం ఉదయం ఆ దేశం జరిపిన బాలిస్టిక్ క్షిపణి ప్రయోగాలు పొరుగు దేశాలైన దక్షిణ కొరియా, జపాన్‌లను గజగజ వణికిస్తున్నాయి. ఈ ఏడాదిలోనే ఇది నాలుగోసారి కావడం, అది కూడా నేరుగా సముద్ర తీరాల నుంచి ప్రయోగించడం కిమ్ జోంగ్ ఉన్ మొండివైఖరికి అద్దం పడుతోంది. ప్యాంగ్‌యాంగ్ చేస్తున్న ఈ కవ్వింపు చర్యలు తూర్పు ఆసియాలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని అనిశ్చితిని సృష్టించాయి.

**సిన్పో నుంచి సముద్రం వరకు..**

దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ నివేదిక ప్రకారం.., ఉత్తర కొరియా తన తూర్పు తీరంలోని సిన్పో ప్రాంతం నుంచి ఈ క్షిపణులను ప్రయోగించింది. ఈ క్షిపణులు జపాన్ ఆర్థిక మండలికి సమీపంలో ఉన్న సముద్రంలో పడినట్లు గుర్తించారు. ఇవి స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులైనా, వీటి వేగం, ఖచ్చితత్వం గతంలో కంటే మెరుగ్గా ఉన్నాయని జపాన్ రక్షణ మంత్రిత్వ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికాను, దాని మిత్రదేశాలను లక్ష్యంగా చేసుకోగల సామర్థ్యాన్ని తాము పెంచుకుంటున్నామని ఉత్తర కొరియా పరోక్షంగా సంకేతాలు ఇస్తోంది.

**అప్రమత్తమైన పొరుగు దేశాలు**

ఉత్తర కొరియా కదలికలతో దక్షిణ కొరియా అధ్యక్ష కార్యాలయం వెంటనే స్పందించింది. పరిస్థితిని సమీక్షించడానికి 'జాతీయ భద్రతా మండలి' అత్యవసరంగా భేటీ అయ్యింది. ఉత్తర కొరియా చేసే ఏ చిన్న సాహసానికైనా ధీటుగా సమాధానం ఇవ్వాలని నిర్ణయించింది. అమెరికా, జపాన్, దక్షిణ కొరియా దేశాలు తమ నిఘా వ్యవస్థలను అనుసంధానించాయి. ఉత్తర కొరియా అణు కేంద్రాల్లో కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నాయి.

**కిమ్ జోంగ్ ఉన్ అణు ఆకాంక్షలు**

గత వారం ఒక యుద్ధ నౌక నుంచి జరిగిన క్షిపణి ప్రయోగాన్ని స్వయంగా పర్యవేక్షించిన కిమ్, తన సైన్యానికి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించారు. దేశం వద్ద ఉన్న అణ్వస్త్రాలను 'భారీగా విస్తరించడమే' తన ప్రధాన అజెండా అని ప్రకటించారు. శత్రువుల నుంచి ముప్పు పొంచి ఉన్నప్పుడు అణుదాడి సామర్థ్యమే తమకు రక్షణ అని ఆయన నమ్ముతున్నారు. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రోస్సీ మాటలు మరింత భయపెడుతున్నాయి. ఉత్తర కొరియాలోని అణు రియాక్టర్లలో కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతున్నాయని, వారు ప్లుటోనియం నిల్వలను పెంచుకుంటున్నారని ఆయన ధృవీకరించారు.

**ఐక్యరాజ్యసమితి తీర్మానాలు బేఖాతరు**

బాలిస్టిక్ క్షిపణులను వాడకూడదని ఉత్తర కొరియాపై ఇప్పటికే అనేక ఆంక్షలు ఉన్నాయి. కానీ, ఆ దేశానికి మద్దతుగా నిలిచే రష్యా, చైనా వంటి దేశాల వల్ల ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో కొత్త ఆంక్షలు విధించడం కష్టమవుతోంది. ఇదే అదనుగా భావిస్తున్న కిమ్, తన క్షిపణి సాంకేతికతను శిఖరాగ్రానికి చేరుస్తున్నారు. తూర్పున ఉత్తర కొరియా, పశ్చిమాన ఇరాన్.. ఇలా రెండు వైపులా యుద్ధ వాతావరణం నెలకొనడం ప్రపంచ శాంతికి పెను సవాలు. దక్షిణ కొరియా కూడా తన రక్షణ బడ్జెట్‌ను పెంచి, అమెరికాతో కలిసి భారీ సైనిక విన్యాసాలు చేస్తోంది. ఈ పోటీ ఇలాగే కొనసాగితే, ఏదో ఒక చిన్న పొరపాటు కొరియా ద్వీపకల్పంలో మరో భీకర యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉంది. కిమ్ జోంగ్ ఉన్ క్షిపణి గర్జనలు కేవలం పొరుగు దేశాలనే కాదు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కూడా కుదిపేస్తున్నాయి.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఒకసారే నిజరూపం...మహిమ అద్భుతం

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో ఎక్కడ ఆలయాల్లో అయినా స్వామి వారి అసలు రూపంతోనే దర్శనం భక్తులకు లభిస్తుంది. కానీ ఏకైక ఆలయంగా విశాఖలోని సింహాచలం శ్రీ వరాహ నరసింహ స్వామి వారి ఆలయంలో మాత్రమే ఏడాది మొత్తం స్వామి చందనంతో కప్పబడి ఉంటారు. ఒకే ఒక్క రోజున ఆయన నిజ రూపం కనిపిస్తుంది. అలా ఆ ఒక్క రోజునే స్వామిని దర్శించుకుని తరించే అవకాశం దక్కుతుంది. ఆ రోజు వైశాఖ శుద్ధ తృతీయ. దానినే అక్షర తృతీయగా కూడా చెబుతారు. అందుకే సింహాచలంలో చందనోత్సవం రోజు అంటే ఏపీ తెలంగాణా మాత్రమే కాదు ఒడిశా చతీష్ ఘడ్ వంటి చోట్ల నుంచి భక్తులు వేలల్లో తరలి వస్తారు. ఏడాదికి ఒకసారి కనిపించే నిజ రూప దర్శన భాగ్యాన్ని అందుకునేందుకు క్యూలు కడతారు. గంటల తరబడి వేచి ఉండి మరీ స్వామి రూపాన్ని చూసి జన్మ ధన్యం అయిందని ఆధ్యాత్మిక ఆనందాన్ని గుండె నిండా నింపుకుని వెనక్కి మరలుతారు.

**పుట్టలో వెలసిన స్వామి :**

ఇదిలా ఉంటే నిజ రూప దర్శనం వెనక ఆసక్తిని కలిగించే పురాగణ గాథ ఒకటి ఉంది. స్వామి వారి విగ్రహం పుట్టలో దొరికింది. దాని కోసం సాగిన అన్వేషణ కూడా ఎంతో ఉత్కంఠగా ఉంటుంది. యుగాల క్రితం చంద్రవంశానికి చెందిన పురూరవ చక్రవర్తి అలా ఆకాశమార్గాన పయనిస్తూ ఉంటే ఆయన విమానం సింహాచలం క్షేత్ర సమీపంలోకి వచ్చాక ముందుకు కదలక ఆగిపోతుంది. దాంతో పురూరవ చక్రవర్తి అక్కడే నేల మీదకు దిగుతాడు. ఆయనకు ఆ సమయంలో అక్కడ అడవిలో పూర్తిగా పుట్టతో కప్పబడిన స్వామి వారి విగ్రహం కనిపిస్తుంది. ఆయన పుట్టను సమీపంలోని గంగా జలంతో తొలగించి స్వామిని కనుగొంటాడు. అయితే ఉగ్ర రూపంలో ఉన్న ఆ నిజ మూర్తిని చూసిన పురూరవ చక్రవర్తి ఆశ్చర్యపోతాడు, భీతిల్లుతాడు. ఆ సమయంలో ఆకాశవాణి ఆయనకు చెబుతుంది. భక్తులు ఎవరూ నిజరూపం సాధారణ రోజులలో చూడలేరని అందువల్ల తిరిగి ఆ విగ్రహాన్ని కప్పి ఉంచి అక్కడే ప్రతిష్టించాలని. దాంతో చందనం పూసి ఆ విగ్రహాన్ని చక్రవర్తి అక్కడ కొలువు తీరుస్తాడు. సింహాచలం క్షేత్రాన్ని కూడా ఆయనే నిర్మిస్తాడు. అలా ఏడాదికి ఒకసారి స్వామి నిజరూప దర్శనం సంప్రదాయం కూడా ఆయనే ప్రారంభించారు. అదే తరువాత కాలంలో సింహాచలం గా ప్రసిద్ధి చెందింది. నాటి నుంచి స్వామి భక్తుల కోరిక మేరకు ఏడాదికి ఒకసారి నిజ రూపం దర్శనం ఇస్తాడు.

**నిజరూపం ఎలా ఉంటుందంటే :**

స్వామి ఏడాది పొడవునా చందనంతో కప్పబడి లింగాకారంలో భక్తులకు దర్శనం ఇస్తారు. కానీ నిజ రూపంలో ఎలా ఉంటారు అన్న ఆసక్తి అందరికీ ఉంటుంది. స్వామి వరాహ ముఖంతో నరుని శరీరంతో నిజ రూపంలో ఉంటారు. శ్వేత వర్ణంతో రెండు చేతులతో ఉంటారు. స్వామివారి భుజంపై తోక ఉంటుంది. అలాగే తలపై తెల్లని జూలు ఉంటుంది. ఇక నిజరూపంలో స్వామివారి పాదాలను దర్శించుకోవచ్చు. అక్షయ తృతీయ నాడు తెల్లవారుజాము నుంచి స్వామి వారి దర్శనాలు భక్తులకు లభిస్తాయి. ఇక నిజరూప దర్శనం అయిన వెంటనే స్వామివారికి మళ్లీ చందనం పూస్తారు. అయితే సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహ స్వామి నిజరూప దర్శనం అనేది సింహాచల క్షేత్రంలో జరిగే అత్యంత పవిత్రమైన విశిష్టమైన ఆధ్యాత్మిక కార్యక్రమంగా ఉంటుంది.

**శ్రీకృష్ణదేవరాయల కాలంలో :**

సింహాచలం ఆలయాన్ని శ్రీకృష్ణదేవరాయలు కాలంలో ఎంతో అభివృద్ధి చేశారు. శ్రీకృష్ణదేవరాయలు స్వామి వారిని దర్శించుకుని మరీ ఎన్నో అభరణాలు ఆయనకు కానుకగా సమర్పించారు. అంతే కాదు రత్నాల హారాలను బహుమతిగా అందించి భక్తితో కొలిచారు. దాని కంటే ముందు ఈ ఆలయాన్ని 13వ శతాబ్దంలో తూర్పు గంగా రాజవంశానికి చెందిన నరసింహ దేవుడు ఈ అభివృద్ధి చేశారని చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఆధునిక కాలంలో ప్రభుత్వాలు కూడా ఈ ఆలయాన్ని ఎంతగానో అభివృద్ధి చేస్తూ వస్తున్నాయి. గతానికి పోలిస్తే స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎన్నో సదుపాయాలను కల్పిస్తున్నారు.

## అమెరికా వీసా కష్టాలు: 9 ఏళ్లలో 4 సార్లు తిరస్కరణ.. ఒక భారతీయ కుటుంబం ఆవేదన!

**హైదరాబాద్ పెన్ పవర్:** అగ్రరాజ్యం అమెరికా వెళ్లాలనేది చాలా మంది భారతీయుల కల. అయితే ఆ కల నెరవేరాలంటే పాస్‌పోర్ట్‌పై 'యూఎస్ వీసా' ముద్ర పడటం అంత తేలికైన విషయం కాదని మరోసారి రుజువైంది. తాజాగా ఒక భారతీయ కుటుంబానికి ఎదురైన చేదు అనుభవం ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా ముఖ్యంగా రెడిట్ లో పెద్ద చర్చకు దారి తీసింది. తొమ్మిదేళ్ల వ్యవధిలో ఏకంగా నాలుగు సార్లు ప్రయత్నించినా అమెరికా విజిటర్ వీసా (బీ1/బీ2) లభించకపోవడం విస్మయానికి గురి చేస్తోంది.

**దశాబ్ద కాలంగా సాగుతున్న వీసా పోరాటం**

సదరు కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. వారి వీసా ప్రయత్నాలు 2017లో ప్రారంభమయ్యాయి. అప్పట్లో ఒక కుటుంబ వివాహానికి హాజరుకావడానికి రెండుసార్లు దరఖాస్తు చేసుకోగా రెండుసార్లూ తిరస్కరణకు గురయ్యారు. అనంతరం 2018లో తమ కుమారుడి గ్రాడ్యుయేషన్ వేడుకకు వెళ్లాలని భావించి మూడోసారి దరఖాస్తు చేశారు. కొడుకు చదువు పూర్తి చేసుకుంటున్న ఆ మధుర క్షణాలను ప్రత్యక్షంగా చూడాలనుకున్న ఆ తల్లిదండ్రులకు అప్పుడు కూడా నిరాశే ఎదురైంది. వరుసగా మూడుసార్లు తిరస్కరణ ఎదురవడంతో ఆ కుటుంబం తమ ప్రొఫైల్‌ను మరింత పటిష్టం చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా గత కొన్నేళ్లలో కెనడా, సింగపూర్, మలేషియా వంటి దేశాలను సందర్శించి బలమైన 'ట్రావెల్ హిస్టరీ' ని నిర్మించుకున్నారు. ఆర్థిక స్థిరత్వాన్ని నిరూపించే పత్రాలు స్వదేశంలో తమకున్న బలమైన బంధాలను చూపే ఆధారాలను సిద్ధం చేసుకుని, 2026లో నాలుగోసారి అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. కానీ విధి వెక్కిరించినట్లు ఈసారి కూడా వారికి వీసా లభించలేదు.

**సెక్షన్ 214(బీ): అతిపెద్ద అడ్డంకి**

ఈసారి కూడా వీసా తిరస్కరణకు కారణంగా సెక్షన్ 214(బీ)ని చూపించారు. అమెరికా వలస చట్టాల ప్రకారం వీసా కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి వ్యక్తి 'సంభావ్య వలసదారు' అని అధికారులు భావిస్తారు. దరఖాస్తుదారుడు తన పర్యటన ముగిసిన తర్వాత తిరిగి సొంత దేశానికి వస్తాడనే బలమైన సాక్ష్యాధారాలను చూపడంలో విఫలమైతే ఈ సెక్షన్ కింద వీసాను తిరస్కరిస్తారు.

అయితే ఆ కుటుంబం వాదన మరోలా ఉంది. తాజా ఇంటర్వ్యూ కేవలం రెండు నిమిషాల్లోనే ముగిసిపోయిందని, తమ ఆర్థిక స్థితిగతులు లేదా ఉద్యోగ బాధ్యతలను కనీసం పరిగణనలోకి కూడా తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండ్రి ప్రభుత్వ ప్రాజెక్టులతో సంబంధం ఉన్న నిర్మాణ రంగ వ్యాపారిగా ఉండటం.. ఇంట్లో వృద్ధులను చూసుకోవాల్సిన బాధ్యత ఉండటం వంటి అంశాలేవీ అధికారులను మెప్పించలేకపోయాయి.

**బంధుత్వాలే శాపమా?**

ఈ ఉదంతంలో మరో ఆసక్తికరమైన కోణం ఏమిటంటే ఆ కుటుంబానికి అమెరికాలో ఉన్న బలమైన సంబంధాలు. వారి ఒక కుమారుడు 2016 నుంచి అక్కడే స్థిరపడి వివాహం చేసుకుని ఉంటున్నారు. అలాగే తండ్రి సోదరుడు కూడా గ్రీన్ కార్డ్ హోల్డర్. సాధారణంగా విదేశాల్లో బంధువులు ఉంటే వీసా సులభంగా వస్తుందని భావిస్తారు. కానీ ఇక్కడ అదే వారికి ప్రతిబంధకంగా మారిందని అనుమానిస్తున్నారు. అమెరికాలోనే బంధువులు ఉండటం వల్ల వీరు కూడా అక్కడికి వెళ్లి తిరిగి రారేమోనన్న సందేహం అధికారులకు కలిగి ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

**నెటిజన్ల స్పందన.. ఆందోళన**

ఈ పోస్టుపై స్పందిస్తున్న నెటిజన్లు అమెరికా వీసా ప్రక్రియలోని అపారదర్శకతను తప్పుపడుతున్నారు. వేల రూపాయల ఫీజు చెల్లించి, నెలల తరబడి వెయిట్ చేసినా, కనీసం దరఖాస్తుదారుడి గోడు వినకుండానే సెకన్ల వ్యవధిలో నిర్ణయాలు తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. బలమైన ఆర్థిక నేపథ్యం, ట్రావెల్ హిస్టరీ ఉన్నప్పటికీ వీసా రాకపోవడం విచారకరమని అభిప్రాయపడుతున్నారు. మొత్తంమీద ఈ ఘటన అమెరికా విజిటర్ వీసా పొందడం అనేది కేవలం అర్హతపైనే కాకుండా ఆ సమయానికి ఉండే 'లక్' పైన కూడా ఆధారపడి ఉంటుందనే చర్చను మరోసారి తెరపైకి తెచ్చింది.

# స్టాలిన్ ని ఢీ కొడుతున్న బాబు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్డీయేలో అత్యంత కీలకమైన భాగస్వామిగా ఉన్నారు అన్నది తెలిసిందే. ఎన్డీయేలో బీజేపీ 240 సీట్లతో తొలి స్థానంలో ఉంటే 16 మంది ఎంపీలతో టీడీపీ రెండో పెద్ద పార్టీగా ఉంది. దానికి తగినట్లే ఎన్డీయేలో టీడీపీకి బాబుకు విశేష ప్రాధాన్యత రాజకీయంగా లభిస్తోంది. ఇదిలా ఉంటే దేశంలో ప్రస్తుతం జరుగుతున్న అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో ఎన్డీయే విజయం కోసం మిత్ర పార్టీలు అన్నీ మద్దతుగా నిలిచి ప్రచారంలోకి దిగిపోయాయి. ఇక ఏపీకి పక్కనే ఉన్న తమిళనాడు విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు కూడా ఎన్ డీయే అభ్యర్థుల తరపున ప్రచారానికి సిద్ధపడుతున్నారు.

**తమిళ సీమలో ప్రచారం :**

తమిళనాడు అంటే ఒకనాడు ఏపీతో కలసి ఉన్న రాష్ట్రమే. అంతే కాదు తెలుగు మాట్లాడే ప్రాంతాలు కూడా ఇక్కడ అధికంగా ఉన్నాయి. దాంతో బాబు ఎన్డీయే కూటమి తరపున ప్రచారానికి రంగంలోకి దిగిపోతున్నారు. ఈ మేరకు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల పాటు తమిళనాడులో పర్యటించనున్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో తమిళనాడులోని కోయంబత్తూరు, హోసూరు, తల్లి, ఆవడి, మధురైలలో ఎన్డీఏ పక్షాల అభ్యర్థుల తరపున బాబు ప్రచారం నిర్వహించనున్నారని తెలుస్తోంది.

**కోయంబత్తూరు నుంచే :**

ఇక ఈ నెల 20న ఉదయం అమరావతి నుంచి కోయంబత్తూరు బయల్దేరి వెళ్లనున్న చంద్రబాబు మధ్యాహ్నం ఒంటి గంటకు కోయంబత్తూరులో నిర్వహించే ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారు. ఆ విధంగా తొలి సభతో బాబు ఎన్నికల ప్రచారం మొదలై రెండు రోజుల పాటు ఉధృతంగా సాగుతుంది అని అంటున్నారు. కోయంబత్తూరు నుంచి హోసూరు నుంచి తల్లి చేరుకుని బాబు అదే రోజు సాయంత్రం అక్కడ జరిగే ప్రచార ర్యాలీకి హాజరవుతారు. ఇక 20వ తేదీ రాత్రికి చెన్నై చేరుకుని ఆవడిలో జరుగనున్న రోడ్ షోలో పాల్గొని ఎన్డీఏ అభ్యర్థుల తరపున ప్రచారం చేయనున్నారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఇక చెన్నైలోనే బాబు రాత్రికి బస చేస్తారు. ఆ మరుసటి రోజు అంటే 21వ తేదీ ఉదయం చెన్నై నుంచి బయలుదేరి మధురైకి బాబు చేరుకుంటారు. మధురై సమీపంలోని సాత్తూర్ లో మధ్యాహ్నం ఒంటి గంటకు వివిధ సామాజిక వర్గాల నేతలతో సమావేశం ఆయన నిర్వహించనున్నారు. అనంతరం మూడు గంటలకు సాత్తూర్ లోనే ఎన్డీఏ అభ్యర్థి తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం మధురై నుంచి నేరుగా హైదరాబాద్ కు చేరుకుంటారు.

**పాత మిత్రునితో ఢీ :**

ఇదిలా ఉంటే స్టాలిన్ చంద్రబాబు పాత మిత్రులు. కరుణా నిధి కాలం నుంచి డీఎంకే టీడీపీల మధ్య మంచి స్నేహం ఉంది. ఎన్నో సార్లు కలసి పనిచేశారు. జాతీయ స్థాయిలో ఈ రెండు పార్టీలు భుజం కలిపి ప్రభుత్వాల ఏర్పాటులో కీలక పాత్ర పోషించాయి. అయితే బాబు ఇపుడు ఎన్డీయేలో ఉన్నారు. దాంతో స్టాలిన్ ప్రత్యర్థిగానే భావించి ఎన్నికల ప్రచారంలోకి దిగుతున్నారు. తమిళనాడులో త్రిముఖ పోరు సాగుతోంది. ఎన్డీయేలో అన్నా డీఎంకే బీజేపీ ఇతర పార్టీలు ఉన్నాయి. ఒక విధంగా బీజేపీ తమిళనాడుని ప్రతిష్టగా భావిస్తోంది. దాంతో బాబుతో ప్రచారం చేయిస్తోంది అని అంటున్నారు తమిళనాడులో కూడా బాబుకు ఆదరణ ఉంది కాబట్టి అది ఓట్ల రూపంలో మారుతుందని బీజేపీ పెద్దలు విశ్వసిస్తున్నారు. ఇక తమిళనాడులో బాబు ఏమి మాట్లాడుతారు, స్టాలిన్ మీద ఏ రకమైన విమర్శలు చేస్తారు అన్నది చూడాల్సి ఉంది.

# మాజీ మంత్రి అంబటి ఒకరోజు దీక్ష.. టీడీపీ వ్యంగ్యస్త్రాలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు 12 గంటల నిరాహారదీక్ష ముగిసింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆయన గుంటూరు కలెక్టరేట్ ఎదుట నిరాహారదీక్ష చేశారు. తనను కస్టడీలో హింసించిన పోలీసులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన ఈ నిరసన దీక్ష చేపట్టారు. అయితే ఈ దీక్ష విఫలమైందని, కనీసం వంద మంది కూడా అంబటికి సంఘీభావం తెలిపేందుకు రాలేదంటూ టీడీపీ విమర్శలు గుప్పిస్తోంది. గుంటూరు వేదికగా మాజీ మంత్రి అంబటి రాంబాబు నిర్వహించిన నిరసన దీక్ష రాజకీయంగా హాట్ టాపిక్ గా మారింది. జనవరి 31న తన ఇంటిపై పోలీసుల సమక్షంలోనే టీడీపీ కార్యకర్తలు దాడి చేశారని, తనను అరెస్టు చేసి 18 రోజులు జైలులో పెట్టిన పోలీసులు, తన ఇంటిపై దాడి చేసిన కార్యకర్తలను కనీసం 18 నిమిషాలు కూడా పోలీసు స్టేషన్ లో పెట్టలేదని అంబటి రాంబాబు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా తనను అరెస్టు చేసిన నల్లపాడు పోలీసులు కస్టడీలో హింసించారని ఆరోపించారు.పోలీసులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంబటి డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ప్రోద్బలంతోనే టీడీపీ కార్యకర్తలు తన ఇంటిపై దాడి చేశారని అంబటి ఆరోపించారు. పోలీసులు తమ వాహనాలకు టీడీపీ జెండాలు కట్టుకుని తిరగాలని ధ్వజమెత్తారు. దాడిని ప్రోత్సహించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని,

తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరినీ వదిలిపెట్టమని మాజీ మంత్రి అంబటి హెచ్చరించారు.

అయితే అంబటి దీక్షకు వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇంచార్జి నూరీ ఫాతిమా సంఘీభావం తెలిపారు. పలువురు కార్యకర్తలు సైతం అంబటి దీక్షా శిబిరాన్ని సందర్శించారు. అయితే అధికార పక్షం మాత్రం అంబటి దీక్షను ఎద్దేవా చేస్తూ విమర్శలు గుప్పిస్తోంది. ఈ దీక్షతో అంబటికి ప్రజల్లో ఎంత బలం ఉందో స్పష్టమైందని టీడీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. కనీసం వంద మంది అయినా దీక్షా శిబిరాన్ని సందర్శించలేదని, పట్టుమని పది మంది కూడా శిబిరం లేరంటూ ఎద్దేవా చేస్తున్నారు. దీంతో అంబటి దీక్షపై ఇరుపార్టీల మధ్య డైలాగ్ వార్ నడుస్తోంది.

## రాజస్థాన్‌పై రింకు సింగ్, అనుకూల్ కిరాక్ బ్యాటింగ్..
# ఐపీఎల్‌లో కేకేఆర్‌కు తొలి విజయం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ (ఖఖ=) ఎట్టకేలకు బోణీ కొట్టింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన హై-వోల్టేజ్ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ అద్భుత విజయాన్ని అందుకుంది. ఓటమి కోరల్లో ఉన్న జట్టును రింకూ సింగ్ తన ఫినిషింగ్ టచ్‌తో గట్టెక్కించి, స్టేడియాన్ని హోరెత్తించాడు. 156 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతాకు ఆరంభంలోనే రాజస్థాన్ బౌలర్లు చుక్కలు చూపించారు. ఓపెనర్లు టిమ్ సీఫెర్ట్, అజింక్య రహానే ఇద్దరూ ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరడంతో కేకేఆర్ 5 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. రాజస్థాన్ స్పిన్నర్ రవీంద్ర జడేజా తన స్పిన్ మాయాజాలంతో రోవ్‌మన్ పావెల్ (23), అంగక్రిష్ రఘువంశీలను అవుట్ చేసి కేకేఆర్ ఆశలపై నీళ్లు చల్లాడు. కామెరాన్ గ్రీన్ (27) కాసేపు పోరాడినా రవి బిష్ణోయ్ అతడిని అడ్డుకున్నాడు.

**రింకూ సింగ్ 'మెరుపు' ఇన్నింగ్స్:**

ఒకానొక దశలో కేకేఆర్ ఓటమి ఖాయమనిపించింది. కానీ, క్రీజులోకి వచ్చిన రింకూ సింగ్, అనుకూల్ రాయ్ బాధ్యతాయుతంగా ఆడారు. మొదట సింగిల్స్‌తో స్కోర్ బోర్డును నడిపించిన ఈ జోడీ, చివరి ఓవర్లలో ఒక్కసారిగా గేర్ మార్చింది. చివరి ఓవర్లో కేకేఆర్ విజయానికి 11 పరుగులు అవసరమవగా.. రింకూ సింగ్ తన విశ్వరూపం చూపించాడు. వరుసగా రెండు ఫోర్లు, ఒక కళ్లు చెదిరే సిక్సర్ బాది మ్యాచ్‌ను ఫినిష్ చేశాడు. ఈ క్రమంలోనే రింకూ సింగ్ తన కెరీర్‌లో మరో అద్భుతమైన అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు.

**రాజస్థాన్ బౌలింగ్:**

రాజస్థాన్ బౌలర్లలో రవీంద్ర జడేజా 2 వికెట్లతో ఆకట్టుకోగా, జోఫ్రా ఆర్చర్, నాంద్రే బర్గర్, రవి బిష్ణోయ్, యశ్ రాజ్ పుంజా తలో వికెట్ పడగొట్టారు. అయితే

చివరి నిమిషంలో రింకూ సింగ్‌ను అడ్డుకోవడంలో రాజస్థాన్ బౌలర్లు ఘోరంగా విఫలమయ్యారు. మొదట్లో అద్భుతమైన బౌలింగ్ తో కేకేఆర్ అడ్డుకున్నప్పటికీ, చివర్లో మాత్రం ఫెయిల్ కావడంతో.. ఐపీఎల్ లో కోల్‌కతా నైట్‌రైడర్స్ మొదటి విజయాన్ని నమోదు చేసుకుంది.

# టాస్ గెలిచి బౌలింగ్ తీసుకున్న లక్నో.. పంజాబ్ ఫస్ట్ బ్యాటింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో భాగంగా ముల్లాన్‌పూర్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో పంజాబ్ కింగ్స్ వర్సెస్ లక్నో సూపర్ జెయింట్స్ మధ్య జరుగుతున్న పోరులో టాస్ గెలిచిన లక్నో కెప్టెన్ రిషబ్ పంత్ ముందుగా బౌలింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. దీంతో పంజాబ్ జట్టు మొదట బ్యాటింగ్ చేసేందుకు క్రీజులోకి రానుంది. ఈ మ్యాచులో భారీ టార్గెట్ పెట్టి లక్నోపై ఒత్తిడి పెట్టాలని లక్ష్యంతో పంజాబ్ బరిలోకి దిగుతుంది. లక్నో సూపర్ జెయంట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ మాట్లాడుతూ.. మేము ముందుగా బౌలింగ్ చేయాలనుకుంటున్నాం.. ఇక్కడ ప్రత్యర్థి జట్టు నిర్దేశించే లక్ష్యాన్ని ఛేదించడం మాకు ఇష్టం.. పంజాబ్ ఈ టోర్నీలో అత్యుత్తమ జట్లలో ఒకటిగా ఉంది, కానీ ఇది మాకు స్వేచ్ఛగా ఆడే అవకాశాన్ని ఇస్తుంది.. జట్టులో ఒక మార్పు చేశాం.. దిగ్వేశ్ రాఠీ స్థానంలో సిద్ధార్థ్ జట్టులోకి వచ్చాడని పంత్ వెల్లడించారు. పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు మేము ముందుగా బ్యాటింగ్ చేయలేదు, కాబట్టి ఇది మాకు ఒక మంచి సవాలు.. జట్టు మెరుగుపడుతున్నప్పుడు అది 'మాలో మాకే' పోటీ అని నేను భావిస్తాను.. అజేయంగా కొనసాగాలనే పట్టుదలతో ఉన్నాం.. మేము పాత జట్టుతోనే బరిలోకి దిగుతున్నామని అయ్యర్ పేర్కొన్నారు. లక్నో సూపర్ జెయింట్స్: మిచెల్ మార్ష్, ఆయుష్ బదోని, రిషబ్ పంత్ (కెప్టెన్/ వికెట్ కీపర్), ఐడెన్ మార్క్రమ్, నికోలస్ పూరన్, ముకుల్ చౌదరి, మహమ్మద్ షమీ, అవేష్ ఖాన్, ప్రిన్స్ యాదవ్, మణిమారన్ సిద్ధార్థ్, మొహ్సిన్ ఖాన్

పంజాబ్ కింగ్స్: ప్రియాంష్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), కూపర్ కొన్నోలీ, శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), శశాంక్ సింగ్, నెహాల్ వధేరా, మార్కస్ స్టోయినిస్, మార్కో జాన్సెన్, జేవియర్ బార్ట్‌లెట్, అర్ష్‌దీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్

# సూర్యకుమార్ యాదవ్‌పై వేటు..
# టీమిండియా టీ20 కెప్టెన్‌గా శ్రేయస్!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పై వేటు పడే అవకాశంఉందా? అంటే అవుననే సమాధానం చెబుతున్నాయి బీసీసీఐ అధికారిక వర్గాలు. సారథిగా టీమిండియాకు అద్భుత విజయాలు అందించిన సూర్య.. బ్యాటర్ గా మాత్రం పేలవ ప్రదర్శనతో రోజు రోజుకు దిగజారిపోయాడు. దాదాపు ఏడాది పాటు టీ20ల్లో నంబర్--1 బ్యాటర్ కొనసాగిన స్కై.. ఇప్పుడు రెండెంకెల స్కోర్ చేయడానికి కూడా బాగా కష్టపడుతున్నాడు. కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన తర్వాత బ్యాటర్ గా ఘోరంగా విఫలమయ్యాడు. గతేడాది దాదాపు 25కు పైగా టీ20లు ఆడిన సూర్యకుమార్ కనీసం ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేడు. కెప్టెన్సీ భారం అతడి బ్యాటింగ్ పై పడుతున్నట్లు క్రికెట్ పండితులు పేర్కొన్నారు. ఈ క్రమంలో సూర్యను కెప్టెన్సీ నుంచి తప్పించాలని బోర్డు ఆలోచిస్తున్నట్లు తెలుస్తుంది. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ 2028తో పాటు తదుపరి రెండు టీ20 ప్రపంచకప్ లని దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ జట్టును రెడీ చేయాలని యోచిస్తున్నట్లు టాక్. దీంతో సూర్య స్థానంలో మరో ముంబై ప్లేయర్ శ్రేయస్ అయ్యరుకి జట్టు పగ్గాలు అప్పగించేందుకు ఇండియన్ క్రికెట్ బోర్డు ఇంట్రెస్ట్ చూపిస్తున్నట్లు వార్త కథనాలు వస్తున్నాయి. టీ20ల్లో నంబర్-- 4 స్థానానికి అయ్యర్ సరైన ప్రత్యామ్నాయమని బీసీసీఐ భావిస్తుంది. శ్రేయస్ అయ్యర్ ఇప్పటి వరకు జాతీయ జట్టుకు కెప్టెన్సీ వహించనప్పటికీ.. దేశవాళీ క్రికెట్ తో పాటు ఐపీఎల్లో కెప్టెన్ గా అతడికి మంచి ట్రాక్ రికార్డు ఉంది. శ్రేయస్ ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. అంతకుముందు ఐపీఎల్-2024 సీజన్ లో కేకేఆర్ కి ట్రోఫీ అందించాడు. గత సీజన్లో పంజాబ్ జట్టుని సైతం ఫైనల్ చేర్చాడు. ఈ ఏడాది కూడా అతడి సారథ్యంలోని కింగ్స్ టీమ్ అద్భుత విజయాలతో దూసుకుపోతుంది. ఇక శ్రేయస్ డొమెస్టిక్ క్రికెట్ లో కూడా ముంబై జట్టుకు ఎన్నో విజయాలను అందించాడు. దీంతో అతడికి జాతీయ జట్టును నడిపించే సత్తా కూడా ఉందని క్రికెట్ పండితులు చెబుతున్నారు. ఇందులో భాగంగా టీ20 జట్టు పగ్గాలు శ్రేయస్ అయ్యర్ కి ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రచారం జరుగుతుంది.

# ఇండియా డైరీస్ లో గ్లోబల్ బ్యూటీ స్మృతులు




అక్షర గౌడ అద్భుతమైన ఫ్యాషన్ మూమెంట్



వాణి కపూర్ చిక్ స్టూడియో షూట్‌కు తీరప్రాంత మనోజ్ఞతను తెస్తుంది

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా విదేశాల్లో స్థిరపడినా? మూలాలను, భారతీయ సంస్కృతిని ఎప్పటికీ మర్చిపోరని మరోసారి నిరూపించారు. తాజాగా పీసీ సోషల్ మీడియా వేదికగా పంచుకున్న -ఇండియా డైరీస్- ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. భారతదేశ పర్యటనలో భాగంగా అమ్మడు గడిపిన సాధారణ - ఆహ్లాదకరమైన క్షణాలను ఈ ఫోటోలు ప్రతిబింబిస్తున్నాయి. విలాసవంతమైన హోటళ్లకు భిన్నంగా, అచ్చమైన దేశీ స్టైల్‌లో పీసీ విలువైన సమయాన్ని గడపడం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ పర్యటనలో ప్రియాంక స్థానిక దాబాలో భోజనం చేస్తూ కనిపించడం విశేషం.దాల్ మఖానీ, అమృత్‌సరి కుల్చా వంటి వంటకాలను ఎంతో ఇష్టంగా ఆస్వాదిస్తోన్న ఫోటోలు భారతీయ ఆహారంపై ఆమెకున్న మక్కువను చాటుతున్నాయి. విదేశీ వంటకాల కంటే దేశీ మసాలాలు, ఘుమఘుమలాడే పంజాబీ వంటకాలే తనకు నిజమైన తృప్తినిస్తాయని పోస్ట్ లో పేర్కొన్నారు. అంతే కాదు అక్కడ వినిపించే స్థానిక సంగీతం కూడా తన పర్యటనకు మరింత ఉత్సాహాన్ని నింపిందని వెల్లడించారు. అలాగే ప్రియాంక విశ్రాంతి సమయంలో పాత బాలీవుడ్ చిత్రాలను వీక్షించారు. ముఖ్యంగా అతిలోక సుందరి శ్రీదేవి, సల్మాన్ ఖాన్ నటించిన ఐకానిక్ సినిమాలను చూస్తూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తన ఎదుగుదలలో ఆ సినిమాల ప్రభావం ఎంతగా ఉందో? పీసీ పరోక్షంగా గుర్తు చేసుకున్నారు. గ్లోబల్ నటిగా ఎదిగినా? తన మూలాలైన బాలీవుడ్ చిత్రాల పట్ల ఆమెకున్న గౌరవం ఫోటోల ద్వారా అర్ధమవుతుంది.ముంబై వీధుల్లో లభించే భేల్ పూరీ గురించి ప్రియాంక ప్రత్యేకంగా ప్రస్తావించారు. న్యూస్‌పేపర్ కోన్‌లో లభించే ఆ అచ్చమైన ముంబై స్ట్రీట్ ఫుడ్ రుచిని తాను ఎంతగా మిస్ అవుతున్నారో? వివరించారు. కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా ముచ్చటించడం, ఇంట్లో వండిన సాధారణ భోజనాన్ని ఆస్వాదించడం వంటివి ఆమెకు ఎంతో మానసిక ప్రశాంతతను ఇస్తాయని చెప్పుకొచ్చింది.గ్లోబల్ ఐకాన్‌గా ఎంతో బిజీగా ఉండే పీసీ ఇలాంటి చిన్న చిన్న విషయాల్లోనే అసలైన ఆనందం ఉందని చాటి చెప్పారు. ప్రియాంక చోప్రా షేర్ చేసిన -ఫోటో డంప్- కేవలం పర్యటన విశేషాలే కాదు. ఆమెలోని భారతీయురాలిని మరోసారి ఆవిష్కరించాయి. ఎంత ఎత్తుకు ఎదిగినా? ఒదిగి ఉండటం , దేశ సంస్కృతిని, ఆహారాన్ని గౌరవించడం ఆమె గొప్పతనానికి నిదర్శనం. సినిమాల విషయానికి వస్తే -వారణాసి- సినిమాతో అమ్మడు టాలీవుడ్ లోనూ లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ ని వీడిన తర్వాత అమ్మడు హాలీవుడ్ సినిమాలతోనే బిజీ అయిన సంగతి తెలిసిందే. అలాంటి నటిని దర్శకధీరుడు రాజమౌళి మళ్లీ భారత్ కు తీసుకురావడం విశేషం.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com